

జిల్లాలో మళ్లీ గోకులాలు

ప్రస్తుతం గ్రామాల్లో పాడి పరిశ్రమ రైతులకు ప్రధాన ఆదాయ వనరుగా ఉంది. వ్యవసాయం జూదంలా మారినా పాల ఉత్పత్తితో రైతులు కాస్త నిలదొక్కుకోగలుతున్నారు. రైతుల పైన ఆధారపడి ఆదాయం కల్పిస్తున్న పాడి పశువులు, గొర్రెలు, మేకల వంటి జీవాలకు నిలువ నీడ కల్పించడం రైతులకు శక్తికి మించిన పని. దీని కోసమనే గతంలో టీడీపీ ప్రభుత్వం గోకులాలు, మినీ గోకులాల పేరుతో షెడ్లు ఏర్పాటు చేసుకునేందుకు భారీగా సబ్సిడీ సమకూర్చింది. దీంతో పొలం వద్ద లేకుంటే ఇళ్ల ఆవరణాల్లోనూ పాడి ఆవులకు నీడ కల్పించి వర్షాలకు తడవకుండా ఆసరా ఇవ్వ డంతో పాల దిగుబడులు కూడా గణనీయంగా పెరిగే అవకాశమిచ్చారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఈ పథకాన్ని పూర్తిగా అటకెక్కించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం దీనిని తిరిగి పునరుద్ధరిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

- పాడి రైతులకు వరాలు
- జిల్లాకు 1200 యూనిట్లు మంజూరు

కలికిరి, ఆగస్టు 9: జిల్లాలోని పాడి రైతులకు వివిధ కోణాల్లో చేయూతనివ్వడానికి టీడీపీ ప్రభుత్వం సమాయత్తమవుతోంది. వైసీపీ ప్రభుత్వం అటకెక్కించిన గోకులాలు, మినీ గోకులాలు పథకాన్ని మళ్లీ పునరుద్ధరించింది. గత ఐదేళ్లుగా ఏ ఒక్క పథకానికీ నోచుకోని రైతులను అన్ని విధాలా ఆదుకోవడానికి ప్రభుత్వం ముందుకొస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా అటకెక్కిన ఉద్యాన, మెట్ట పంటల కోసం ఉపయోగపడే డ్రిప్, స్ప్రింక్లర్ల పథకాలను తిరిగి మంజూరు చేస్తూ ఇటీవలే ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాల కోసం ఎదురు చూస్తున్న రైతులు అడిగిందే తడవుగా దరఖాస్తులు స్వీకరించి ఆ వెంటనే పరికరాలను అమర్చాలని కూడా ప్రభుత్వం పేర్కొంది. అదే విధంగా 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం గోకులాలు, మినీ గోకులాల పేరుతో పాడి రైతుల వద్ద ఉన్న పశువులకు, జీవాలకు ఆశ్రయం కల్పించడానికి సంకల్పించింది. ఈ పథకంలో వేలాది గోకులాలు మంజూరు చేసింది. 2018-19 చివర్లో మంజూరైన వాటిని నిర్మించుకున్న రైతులకు ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేయకుండా మొండిచేయి చూపించింది. దీంతో పెట్టుబడులు పెట్టి గోకులాలు నిర్మించుకున్న వేలాది మంది రైతులు నష్టపోయారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం వచ్చీ రాగానే రైతులు, పశుపోషకులపై దృష్టి సారించింది. గతంలో అమలు చేసిన గోకులాలు, మినీ గోకులాల నిర్మాణ పథకాన్ని పునరుద్ధరించింది.

గోకులాల యూనిట్ల విలువ

ఇందులో పాడి ఆవులకు మూడు రకాలుగా, గొర్రెలు మేకలు, కోళ్లకు రెండు రకాలుగా షెడ్లు నిర్మించుకునే వెసులుబాటు కల్పించారు. రెండు ఆవులకు సరిపడా షెడ్డు విలువ రూ.1,15,000, ఇందులో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.1,03,500 సబ్సిడీగా అందుతుంది. రైతులు రూ.11,500 పది శాతం పెట్టుబడి పెట్టాలి. అదేవిధంగా నాలుగు ఆవుల కోసం రూ.1,85,000, ఆరు ఆవుల కోసం రూ.2,30,000 మంజూరు చేయనున్నారు. ఇందులో కూడా 90 శాతం సబ్సిడీ పోనూ 10 శాతం రైతులు భరించాల్సి ఉంటుంది. ఇక 20 గొర్రెలు లేక మేకల కోసం రూ.1,30,000, 50 వాటి కోసం రూ.2,30,000 ఖర్చవుతుంది. ఇందులో కూడా రైతులు 30 శాతం వాటా భరించాల్సి ఉంటుంది. అదేవిధంగా కోళ్లకు షెడ్లు నిర్మించుకునేందుకు వంద కోళ్లకు రూ.87,000 ఖర్చులో రూ.26,100 రైతు వాటాగా నిర్ణయించారు. అదేవిధంగా 200 కోళ్లకు సరిపడా షెడ్డుకు మొత్తం రూ.1,32,000 కాగా రైతులు రూ.39,600 భరించాల్సి ఉంటుంది. వీటన్నిటినీ రైతులే స్వయంగా నిర్మించుకుంటే ఖర్చులో ఆదా కూడా జరుగుతుంది. అవసరమైన వారు సచివాలయ పశు సహాయకులను గానీ, పశు వైద్యులను గానీ సంప్రదించవచ్చు. సన్న, చిన్నకారు రైతులంతా అర్హులే. ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు మంజూరయ్యే వారంతా దరఖాస్తు చేసుకోవచ్చు. షెడ్డు మాత్రం ప్రభుత్వ నమూనా మేరకే నిర్మించాల్సి ఉంటుంది.


రైతులు నిర్మించుకున్న మినీ గోకులాలు

జిల్లాకు 1200 యూనిట్లు మంజూరు

జిల్లాకు మొత్తం 1200 యూనిట్లు మంజూరయ్యాయి. ఇందులో గత ఆర్థిక సంవత్సరానికి చెందినవి 480 కాగా ఈ సంవత్సరానికి 720 మంజూరు చేశారు. మొత్తం మీద కరువు ప్రాంతంగా పేర్కొన్న ఒక్కో మండలానికి 50 వంతున, సాధారణ మండలాలకు 25 వంతున మంజూరయ్యాయి. మదనపల్లె డివిజన్‌లోని 12 మండలాల్లో బి.కొత్తకోట, గుర్రంకొండ, కురబలకోట, పెద్దమండెం, పీటీఎం, తంబళ్లపల్లె మండలాలకు 50 వంతున కేటాయించగా మిగిలిన ఆరింటికి 25 వంతున మంజూరు చేశారు. రాజంపేట డివిజన్‌లో నందలూరు, పెనగలూరు మండలాలకు మాత్రం 50 గోకులాలు మంజూరయ్యాయి. మిగిలిన ఐదు మండలాలకు 25 వంతున కేటాయించారు. రాయచోటి డివిజన్‌లో సంబేపల్లె మండలానికి మాత్రం 25 యూనిట్లు మంజూరయ్యాయి. మిగిలిన మండలాలకు 50 వంతున కేటాయించారు. మొత్తం మీద మదనపల్లె డివిజన్‌కు 450, రాజంపేటకు 225, రాయచోటికి 525 యూనిట్లను మంజూరు చేశారు.

పెద్దిరెడ్డి అనుచరుడి ఇంట్లో
కీలక పత్రాలు స్వాధీనం

- పరారీలో శశికాంత్
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వాస్తవాలు


ఫైళ్ల దహనం కేసుకు అనుసంధానంగా నమోదు చేసిన కేసులో నిందితుడు శశికాంత్ (ఫైల్‌ఫొటో)

మదనపల్లె టౌన్, ఆగస్టు 9: మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో గత నెల 21వ తేదీ రాత్రి ఫైళ్ల దహనం ఘటనపై మదనపల్లె వన్‌టౌన్‌లో అప్పటి ఆర్డీవో హరిప్రసాద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో 15 మంది అనుమాని తులను విచారించిన పోలీసులకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరుడు మదనపల్లెకు చెందిన శశికాంత్ హైదరాబాద్ నగరం మాదాపూర్‌లోని ఆర్‌ఆర్ రెసిడెన్సీలో నివశిస్తున్న ఇంట్లో గత నెల 27వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు పోలీసులు సోదాలు నిర్వహించేందుకు వెళ్లారు. అక్కడ శశికాంత్ ఇంటికి తాళాలు వేసి వుండటంతో మరుసటి రోజు ఉదయం 10గంటలకు శశికాంత్ ఇంటి పొరుగువారు, పెద్దమనుషుల సమక్షంలో పోలీసులు ఇంట్లోకి ప్రవేశించి సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో కీలక మైన పత్రాలు, ఐ-ప్యాడ్, పెన్‌డ్రైవ్, యూకే వీసా, శశికాంత్ పాస్‌పోర్ట్, బ్యాంకు లావాదే వీలకు సంబంధించిన పత్రాలు, ఐటీ రిటర్న్స్, అప్పటి పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి చెందిన అసెంబ్లీ కార్‌పాస్, మదనపల్లెలో శశికాంత్ కొనుగోలు చేసిన భూలావాదేవిలకు సంబంధించిన పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు ఏడు ఖాళీ ప్రామిసరినోట్స్, బ్యాంకుల స్టేట్‌మెంట్లు, భవన నిర్మాణాలకు సంబంధించి ఖర్చుల జాబితా, పీఎల్‌ఆర్ ప్రాజెక్టు వోచర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 136 వస్తువులు, పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు ఎఫ్‌ఐఆర్‌లో తెలిపారు. దీనిపై శశికాంత్‌పై మదనపల్లె వన్ టౌన్ పోలీసు స్టేషన్‌లో గత నెల 29వ తేదీ ఏడు బీఎన్‌ఎస్ సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేశారు. కర్నూల్ రేంజి డీఐజీ కోయ ప్రవీణ్ మదనపల్లె ప్రెస్‌మీట్‌లో తెలిపిన వివరాల మేరకు మొత్తం ఎనిమిది కేసులు నమోదు కాగా అందులో మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా, మున్సిపల్ వైస్ ఛైర్మన్ జింకా చలపతి, వి.మాధవరెడ్డి, కె.రామకృష్ణారెడ్డి, శశికాంత్ పోను మిగిలిన ముగ్గురు ఎవరనేది తెలియాల్సి వుంది. ఈ కేసు సీఐడీకి బదిలీ అయిన నేపథ్యంలో పరారీలో వున్న నిందితుల కోసం పోలీసులు గాలిస్తుండగా, కొందరు మదనపల్లె కోర్టులో, మరికొందరు రాష్ట్ర హైకోర్టులో ముందస్తు బెయిల్ కోసం అప్పీలు వేసినట్లు సమాచారం.

ఎంపీ మిథున్‌రెడ్డి బెయిల్ పిటిషన్ విచారణ వాయిదా

మదనపల్లె టౌన్, ఆగస్టు 9: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిపై పుంగనూరు పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులో బెయిల్ పిటిషన్ సోమవారానికి వాయిదా పడింది. గత నెలలో ఎంపీ మిథున్‌రెడ్డి పుంగనూరులోని మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటికి వచ్చిన సందర్భంగా చోటుచేసుకున్న దాడులు, ప్రతిదాడులు విషయమై పుంగనూరు పోలీసులు ఇరు వర్గాలపై మూడు కేసులు నమోదు చేశారు. ఇందులో టీడీపీకి చెందిన ఎనిమిది మందిపై, 71 మంది వైసీపీ నాయకులపై కేసులు నమోదయ్యాయి. ఇందులో ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, పీకేఎం ఉడా మాజీ ఛైర్మన్ వెంకటరెడ్డి యాదవ్ తదితరులపై హత్యాయత్నం కేసులు నమోదైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మదనపల్లె రెండవ అదనపు జిల్లా జడ్జి కోర్టులో పదిరోజుల క్రితం వైసీపీ నాయకులు బెయిల్‌కు అప్పీలు చేసుకోగా మొదటిసారి కోర్టు బెయిల్‌ను నిరాకరించింది. ఈ క్రమంలో శుక్రవారం రెండో సారి వైసీపీ నాయకులు బెయిల్‌కు అప్పీలు చేసుకోగా.. దీనిపై వాదోపవాదాలు వినిపించాలని సోమవారానికి కోర్టు వాయిదా వేసింది.

జెండా పండుగకు భారీ నజరానాలు

- చిన్న పంచాయతీకి రూ.10 వేలు, మేజర్ పంచాయతీకి రూ.25వేలు
- నిధులు మంజూరు చేయనున్న ప్రభుత్వం

కలికిరి, ఆగస్టు 9: గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో జరిగే స్వాతంత్ర్య వేడుకల నిర్వహణ కోసం ఈ ఏడాది ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేయనుంది. ఈ మేరకు పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ శుక్రవారం ఆమోద ముద్ర వేశారని సమాచారం. ప్రతి ఏడాది గ్రామాల్లో స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర వేడుకల నిర్వహణ స్థానిక గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో నిర్వహించడం పరిపాటి. దీని కోసం చిన్న గ్రామ పంచాయతీలు రూ.వంద, మేజర్ గ్రామ పంచాయతీల్లో రూ.250 ఖర్చు పెట్టుకునే వెసులుబాటు మాత్రం వుండేది. ఈకారణంగా గ్రామాల్లోని నాలుగైదు పాఠశాలల్లో ఏక కాలంలో వేడుకలు నిర్వహించేందుకు ఏ మాత్రం నిధులు సరిపోయేవి కావు. దీంతో అధికారులు, ఉపాధ్యాయుల ఒత్తిడితో ఆయా సర్పంచులే తమ జేబు నుంచి వెచ్చించడం కూడా జరిగేది. నామ మాత్రపు నిధుల కారణంగా పాఠశాలల్లో మొక్కుబడిగా జెండాలు ఎగరేసి, పిల్లలకు ఒకటి, రెండు చాక్లెట్లతో సరిపెట్టాల్సి వచ్చేది. అయితే ఈ దఫా స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పంచాయతీలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఇందుకోసం ప్రతి చిన్న పంచాయతీకి రూ.10వేలు, మేజర్ పంచాయతీకి రూ.25 వేలు విడుదల చేయనున్నట్లు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రకటించడంతో సర్పంచులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే నిధులకు తగ్గట్టు పాఠశాలల్లో కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని సూచిస్తోంది. వేడుకల్లో భాగంగా స్వాతంత్ర్య సమరయోధులను ఘనంగా సత్కరించాలని, విద్యార్థులకు క్రీడా, క్విజ్, వ్యాసరచన పోటీలను నిర్వహించాలని కూడా సూచిస్తోంది. దీనికి కావలసిన మార్గదర్శకాలను ఒకటి రెండు రోజుల్లో విడుదల చేయనున్నారు. కాగా జనవరిలో జరిగే గణ తంత్ర దినోత్సవాలకు కూడా ఇదే స్థాయిలో ప్రభుత్వం నిధులు మంజూరు చేయనుంది.

రూ.50 లక్షలతో నిర్మించిన షాదీమహల్



షాదీమహల్ ముఖద్వారంలో విశ్రాంతి తీసుకుంటున్న శునకాలు



శుభకార్యాల భవనం.. శునకాలకు నిలయం..

- పాలకుల నిర్లక్ష్యానికి నిలువెత్తు రూపం

బి.కొత్తకోట, ఆగస్టు 9: ఈ చిత్రం చూడండి..చక్కగా టైల్స్ పరచిన సుందర ప్రదేశంలో వీధి కుక్కలు హాయిగా విశ్రాంతి తీసుకుంటున్నాయి. తమ కోసం నిర్మించిన విడిది కేంద్రమా... అన్నట్టు సేదతీరుతున్నాయి. వాటి ఇష్టం వాటిది..అడగడానికి మనమెవరు? ఇంతకీ ఈ దృశ్యం ఎక్కడిదంటే బి.కొత్తకోట పట్టణంలోనిది. ఈ భవనం రూ.50 లక్షలతో నిర్మించిన షాదీమహల్. నగర పంచాయతీ కేంద్రమైన బి.కొత్తకోటలో ముస్లిం మైనారిటీల జనాభా అధికంగా ఉండటంతో 2018లో టీడీపీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్ దీనిని ప్రారంభించారు. అయితే మౌలిక వసతుల లేమితో శుభకార్యాలు జరగలేదు. వైసీపీ హయాంలో షాదీమహల్‌లో వసతుల కోసం రూ.7లక్షలు మంజూరైనా వాటిని వినియోగించలేదు. టీడీపీ వాళ్లు కడితే మేమెందుకు పట్టించుకోవాలి అని వైసీపీ పాలకులు అనుకున్నారో ఏమో కానీ దీని గురించి అసలు పట్టించుకోలేదు. యువగళం పాదయాత్రలో భాగంగా నారా లోకేశ్ బి.కొత్తకోట మీదుగా వెళుతూ ఈ షాదీమహల్ వద్ద సెల్ఫీ తీసి సమస్యను సోషల్ మీడియాలో పోస్ట్ చేసినా అప్పటి వైసీపీ పాలకులు స్పందించ లేదు. ప్రస్తుతం ఉన్న కూటమి ప్రభుత్వమైనా షాదీమహల్‌లో మౌలిక వసతులు కల్పించి పేదలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.



షాదీమహల్ వద్ద నారా లోకేశ్ సెల్ఫీ (ఫైల్)

చట్టాన్ని అతిక్రమిస్తే ఎవరినీ వదిలిపెట్టం

- డీఐజీ కోయ ప్రవీణ్

రాజంపేట టౌన్, ఆగస్టు 9: చట్టానికి ఎవరూ అతీతులు కారని, అతిక్రమిస్తే ఎంతటి వారినైనా వదిలి పెట్టమని కర్నూలు రేంజి డీఐజీ కోయ ప్రవీణ్ హెచ్చరించారు. శుక్రవారం తిరుమల వెళుతూ మార్గ మధ్యంలో రాజంపేట అతిథి గృహంలో విశ్రాంతి తీసుకున్నారు. ఆయనకు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలు పుష్పగుచ్ఛాలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్రచందనం అక్రమ రవాణా, గ్యాంబ్లింగ్, మట్కా, గంజాయి పలు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే ఎంతటివారినైనా వదిలిపెట్టమన్నారు. క్రికెట్ బెట్టింగ్‌లు, ఆర్థిక నేరాలకు పాల్పడితే క్షమించబోమన్నారు. గొడవలు, అల్లర్లు సృష్టించేవారిపై నిఘా ఉంటుందన్నారు. రాయచోటి డీఎస్పీ రామచంద్రరావు, సీఐలు మద్దెయ్య ఆచారి, మంజునాథ్‌రెడ్డి, రామాంజనేయులు, ఎస్‌ఐలు మోహన్‌గౌడ్, వెంకటేశ్వర్లు, ఎస్‌బీ కానిస్టేబుల్ అహ్మద్, బాలసుబ్రమణ్యం, భాస్కర్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులు విద్యపై శ్రద్ధ పెట్టాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్)/టౌన్, ఆగస్టు 9: గిరిజన విద్యార్థులు విద్యపై శ్రద్ధ పెట్టి... మంచి భవిష్య త్తుకు పునాది వేసుకోవాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. శుక్రవారం ఉదయం రాయచోటి కలెక్టరేట్ అవరణలో జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన విద్యా ర్థులకు కోసం ప్రతి జిల్లాలో ప్రభుత్వం గిరిజన హస్టళ్లు ఏర్పాటు చేసి.. మంచి విద్యను అందిస్తోందన్నారు. ఆడపిల్లలు చిన్న వయస్సులో పెళ్లి చేసుకోకుండా.. విద్యపై శ్రద్ధ పెట్టి బాగా చదివి మంచి భవిష్యత్తుకు పునాది వేసుకోవాలన్నారు. జిల్లాలో ఏవైనా సమస్యలు ఉంటే గిరిజన సంక్షేమశాఖ అధికారి దృష్టికి కానీ.. తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. జిల్లా సంక్షేమశాఖ అధికారిణి తేజస్విని మాట్లాడుతూ ఆదివాసుల సంస్కృతి సంప్ర దాయాలను 1994లో ఐక్యరాజ్యసమితి గుర్తించిందన్నారు. ఆదివాసులు పర్యావరణ పరి రక్షణకు, సేంద్రియ వ్యవసాయానికి, అడవుల పరిరక్షకు ఎంతో కృషి చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను గిరిజన పిల్లలు ఉపయోగించుకుని వృద్ధిలోకి రావా లన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని గిరిజన నాయకులు రామూర్తినాయక్, రత్నమ్మ, విశ్వనాథనాయక్, గిరిజన విద్యార్థులు, జిల్లా గిరిజన సంక్షేమశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల సందర్శన

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాయచోటి గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలను కలెక్టర్ చామకూరి శ్రీధర్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ప్రాముఖ్యత గురించి విద్యార్థులతో ముచ్చటించారు. అనం తరం విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపి మిఠాయిలు పంచిపెట్టారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత లేకుండా సమస్యను పరిష్కరిస్తామన్నారు. విద్యార్థులకు విశాలమైన ఆటస్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.


గిరిజన విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

పగులుతున్న పాపాల పుట్టలు

పాపాల పుట్టలు పగులుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోని లీలలు ఒక్కొక్కటి బయటపడుతున్నాయి. గుట్టకు ఫ్రీ హోల్డ్ ఇచ్చిన విషయం ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. అలాగే ములకలచెరువు గ్రామానికి సంబంధించిన టెన్‌వన్ మాయ మైంది. గుట్టలో పంటలు సాగు చేసినట్లు రెవెన్యూ రికార్డుల్లో నమోదైంది. ఈవిషయాలన్నీ శుక్రవారం మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ పరిశీలనలో బట్టబయలయ్యాయి.

- గత వైసీపీ ప్రభుత్వ లీలలు.. గుట్టకు ఫ్రీ హోల్డ్
- ములకలచెరువు టెన్‌వన్ మాయం
- గుట్టలో పంటలు సాగు చేసినట్లు అడంగల్
- మదనపల్లె సబ్‌కలెక్టర్ పరిశీలనలో బట్టబయలు


గ్రామ సచివాలయం పక్కనున్న గుట్ట



ములకలచెరువు, ఆగస్టు 9: ములకలచెరువు సమీపంలోని ములకలచెరువు-తంబళ్లపల్లె రోడ్డులో సచివాలయం పక్కనే గుట్ట ఉంది. సర్వే నంబర్ 9లో ఉన్న ఈ గుట్ట విస్తీర్ణం 3.50 ఎకరాలు. 1992లో ఈ గుట్టను ఓ మాజీ నక్సల్‌కు డీ పట్టా ఇచ్చారు. అయితే మొత్తం గుట్ట కావడంతో అలాగే ఉంది. గత కొన్ని సంవత్సరాలుగా ఎవరి అనుభవంలో లేదు. దీంతో ప్రస్తుతం రికార్డుల్లో ప్రభుత్వ గయ్యాలి భూమిగా ఉంది. ఈ క్రమంలో గత వైసీపీ ప్రభుత్వం 2023లో ఈ గుట్టకు ఫ్రీ హోల్డ్ ఇచ్చింది. వైసీపీ నేతల ఒత్తిడితో లేదా పలుకుబడితో ఈ గుట్టకు ఫ్రీ హోల్డ్‌కింద ఎంపిక కావడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఫ్రీ హోల్డ్ భూముల్లో చోటు చేసుకున్న అక్రమాలపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో ప్రస్తుత కూటమి ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఫ్రీ హోల్డ్ భూములను పునఃపరిశీస్తోంది. ఇందులో భాగంగా గత మూడు రోజులుగా ఫ్రీ హోల్డ్ భూములపై రెవెన్యూ అధికారులు, సిబ్బంది, సర్వేయర్లు క్షేత్ర స్థాయిలో పునర్విచారణ జరుపుతున్నారు. ఈ పక్రియ జిల్లా వ్యాప్తంగా జరుగుతోంది. ఈ క్రమంలో శుక్రవారం మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ తొలుత ములకలచెరువు మండలంలోని మద్దినాయనిపల్లెలో ఫ్రీ హోల్డ్ భూములను పరిశీలించారు. అనంతరం పాత ములకలచెరువు గ్రామ సచివాలయం పక్కనున్న గుట్టను పరిశీలించారు. ఈ గుట్టకు ఫ్రీ హోల్డ్ ఇచ్చారని రెవెన్యూ అధికారులు చెప్పారు. దీంతో ఆయన గుట్టను పరిశీలించారు. అనంతరం గుట్టకు సంబంధించిన రికార్డుల వివరాలపై ఆరా తీశారు. ములకలచెరువు గ్రామానికి సంబంధించిన టెన్‌వన్ ఎక్కడని అడగ్గా కనపడడం లేదని సమాధానం ఇచ్చారు. రికార్డుల గదిలో తనిఖీ చేసి వెతకాలని ఆదేశించారు. కాగా 2005 నుంచి 2007 సంవత్సరంలో ఈ గుట్టలో వేరుశనగ, కంది పంట సాగు చేసినట్లు అడంగల్‌లో నమోదైంది. ఈ గుట్టను తన తండ్రి వెంకటరమణకు పట్టా ఇచ్చారని, తమకు కేటాయించి న్యాయం చేయాలని శ్యామల అనే మహిళ సబ్‌కలెక్టర్‌ను కోరగా.. ఈ గుట్ట ప్రభుత్వ భూమిగా రికార్డుల్లో ఉందని పరిశీలిస్తామని చెప్పారు. ఈ గుట్ట ఫ్రీ హోల్డ్ అయినట్లు వెంకటరమణ కుటుంబానికి తెలియదు. డీ పట్టా పొందిన వెంకటరమణ మూడేళ్ల క్రితం మృతి చెందాడు.

రెండు గంటల పాటు రికార్డుల తనిఖీ

ములకలచెరువు తహసీల్దార్ కార్యాలయాన్ని మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ తనిఖీ చేశారు. గ్రామ సచివాలయం వద్దనున్న గుట్టను పరిశీలించిన తరువాత నేరుగా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. ఇక్కడ రెండు గంటల పాటు పలు రికార్డులు పరిశీలించారు. భూ రికార్డులు, ఫ్రీ హోల్డ్ భూముల రికార్డులు తనిఖీ చేశారు. అలాగే సిబ్బందికి పలు సూచనలు , సలహాలు ఇచ్చారు.

రికార్డులు పరిశీలిస్తున్న మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్



ములకలచెరువు గ్రామ టెన్‌వన్ మాయం

ములకలచెరువు టెన్‌వన్ మాయమైనట్లు తెలుస్తోంది. 1915లో జరిగిన రీసర్వే అనంతరం రెవెన్యూ శాఖ ప్రతి గ్రామానికి టెన్‌వన్ రిజిస్టర్‌ను అమలులోకి తీసుకొచ్చింది. 1915 నుంచి ఇచ్చిన పట్టాలు, అసైన్డ్ పట్టాలు అందులో నమోదు చేస్తూ వచ్చారు. అయితే ములకల చెరువు గ్రామానికి సంబంధించిన టెన్‌వన్ కన్పించకుండా పోయింది. ప్రభుత్వం ఫ్రీ హోల్డ్‌పై పునఃపరిశీలనకు ఆదేశించడంతో రెవెన్యూ సిబ్బంది టెన్‌వన్ కోసం కార్యాలయం మొత్తం జల్లెడ పట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ విషయాన్ని రెవెన్యూ సిబ్బంది మదన పల్లె సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

26 మంది ఎంపీడీవోలు రిలీవ్

● ఉమ్మడి జిల్లాకు పూర్వ ఎంపీడీవోలు రాక

కడప(రూరల్) ఆగస్టు 9 : ఇటీవలన జరిగిన 2024 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇతర జిల్లాల నుంచి ఉమ్మడి కడప జిల్లాకు వచ్చిన 26 మంది ఎంపీడీవోలను శుక్రవారం రిలీవ్ చేశారు. ఇందులో 15 మంది ఎంపీడీవోలు కడప జిల్లా నుంచి రిలీవ్ కాగా మరో 11 మంది అన్నమయ్య జిల్లా నుంచి రిలీవ్ అయ్యారు. సదరు ఎంపీడీవోలను వారు ఉన్న జిల్లాలో ముందు పనిచేస్తున్న మండలాలకు తిరిగి పోస్టింగ్ చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో ఈ మార్పు చోటుచేసుకుంది. ఈ మేరకు పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు జడ్పీ సీఈవో మన్నూరు సుధాకర్‌రెడ్డి ఎంపీడీవోలను రిలీవ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

● ఎన్నికల సమయంలో కడప జిల్లాకు వచ్చిన ఎంపీడీవోలు


పేరు	మండలం	సొంత జిల్లా
బి.శివమల్లేశ్వరప్ప	బి. మఠం	కర్నూలు
ఎం.ఫజుల్ రహిమాన్	మైదుకూరు	కర్నూలు
పి.మధుసూధనరెడ్డి	కాశినాయన	కర్నూలు
ఎన్.ఉమామహేశ్వరరావు	సిద్దవటం	కర్నూలు
ఎస్.అమానులా	అట్లూరు	కర్నూలు
ఎస్.సుగుణశ్రీ	దువ్వూరు	కర్నూలు
వి.రజనీకాంత్	బద్వేలు	నెల్లూరు
కేవీ కోటేశ్వరరావు	కలసపాడు	నెల్లూరు
జీఎస్ రామచంద్ర	ఒంటిమిట్ట	అనంతపురం
కె.జోష్నా	లింగాల	అనంతపురం
ఎస్.షకీలా బేగం	సీకేదిన్నె	అనంతపురం
బి.విజయభాస్కర్	వల్లూరు	అనంతపురం
జి.లక్ష్మినరసింహా	పెద్దముడియం	అనంతపురం
పి.దివాకర్	పులివెందుల	అనంతపురం
జె.సాల్మన్	సింహాద్రిపురం	అనంతపురం
అన్నమయ్య జిల్లాకు వచ్చిన అధికారులు....		
ఎ.అమర్‌నాధరెడ్డి	టి.సుండుపలె	చిత్తూరు
పి.సురేంద్రనాధ్	రాయచోటి	చిత్తూరు
నరసింహమూర్తి	పుల్లంపేట	అనంతపురం
పీడీ శ్రీనివాసులు	గాలివీడు	అనంతపురం
డి.ప్రభాకర్	రామాపురం	అనంతపురం
బి.రామకృష్ణ	చిన్నమండెం	అనంతపురం
పి.కుల్లాయి స్వామి	ఓబులవారిపల్లె	అనంతపురం
టి.యోగానందరెడ్డి	రాజంపేట	అనంతపురం
బి.నిర్మలా కుమారి	సంబేపలి	అనంతపురం
ఎ.వెంకటరంగారావు	చిట్వేలి	అనంతపురం
కేవీ సుబ్రమణ్యం	రైల్వేకోడూరు	కర్నూలు

జిల్లాకు పూర్వపు ఎంపీడీవోలు రాక

సాధారణ ఎన్నికల సమయంలో ఈసీ మార్గదర్శకాల ప్రకారము ఉమ్మడి కడప జిల్లా నుంచి ఇతర జిల్లాలకు బదిలీ అయిన ఎంపీడీవోలు ఆయా జిల్లాల నుంచి శుక్రవారం రిలీవ్ అయ్యారు. వీరందరూ ఎన్నికలకు ముందు పనిచేస్తూ ఉండిన మండలాల్లో శనివారం తిరిగి ఎంపీడీవోలుగా బాధ్యతలను చేపట్టనున్నారు.

నేడు అవుకు నుంచి

గండికోటకు కృష్ణాజలాలు



కొండాపురం, ఆగస్టు 9: నంద్యాల జిల్లా అవుకు రిజర్వాయర్ నుంచి శనివారం గండికోట ప్రాజెక్టుకు కృష్ణాజలాలను విడుదల చేయనున్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు అవుకు రిజర్వాయర్ వద్ద జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి కృష్ణమ్మకు పూజలు నిర్వహించి నీటిని విడుదల చేస్తారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ శివశంకర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు కూడా పాల్గొంటారని ఎమ్మెల్యే పీఏ తెలిపారు. అవుకు రిజర్వాయర్ నుంచి జీఎన్ఎస్ఎస్ కెనాల్ ద్వారా సుమారు 55 కిలోమీటర్లు ప్రయాణించి గండికోట సొరంగం ద్వారా ఆదివారం ఉదయానికి కృష్ణాజలాలు గండికోట ప్రాజెక్టులోకి చేరే అవకాశం ఉంది. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 1.44 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. గండికోట ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 26.85 టీఎంసీలు.

భూ వివాదంతోనే రామచంద్ర హత్య

ఏడుగురు నిందితుల అరెస్ట్, 3 బైక్‌లు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం ● ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



హత్య కేసులో పట్టుబడ్డ నిందితుల వివరాలు మీడియాకు తెలుపుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, ఆగస్టు 9: భూ వివాదం కారణంగానే ఉసిరికాయల సిద్దలింగం కుమారుడు ఉసిరికాయల రామచంద్ర (45) హత్య జరిగిందని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఇందుకు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. కలకడ మండలం కదిరాయచెరువకు చెందిన ఉసిరికాయల రామచంద్ర, కోటకొండ వెంకటేశ్ మధ్య గ్రామంలోని సర్వేనెంబర్ 262లో ఉన్న భూముల విషయంలో వివాదం ఉంది. 2023 మే నెల 1న ఈ భూమిలోని చెట్లను రామచంద్ర సోదరుడు శ్రీనాధ్ ఎక్స్‌కవేటర్‌తో తొలగించి చదునుచేస్తూ ఉండగా వెంకటేశ్వర్లు అడ్డుకున్నాడు. అప్పట్లో ఇరువురు కలకడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఈ విషయంలో వెంకటేశ్‌కు అదే గ్రామానికి చెందిన రాంమోహన్ అలియాస్ మోహన్ మద్దతు తెలిపాడు. అప్పటి నుంచి శ్రీనాథ్‌తో పాటు అతని అన్న ఉసిరికాయల రామచంద్రపై వెంకటేశ్ కక్ష పెంచుకున్నాడు. కాగా, తాను గతంలో హత్య చేసి జైలుకు వెళ్లి వచ్చానని వీళ్లను కూడా చంపేస్తానంటూ ఉసిరికాయల రామచంద్ర గ్రామస్తులతో చెప్తుండేవాడని ఎస్పీ తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న వెంకటేశ్, రాంమోహన్‌లు 24 రోజుల క్రితం పెద్దమండెం మండలం వెలిగల్లుకు చెందిన, ప్రస్తుతం మదనపల్లె టౌన్ నక్కలదిన్నెలో నివాసం ఉంటున్న వెంకట్రమణ కుమారుడు తుమ్మల నరేశ్‌తో ఉసిరికాయల రామచంద్రను చంపేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందుకుగాను రూ.3.70 లక్షలు సుపారి మాట్లాడుకున్నారని వివరించారు. ఈ క్రమంలో జూలై 30 అర్ధరాత్రి 11.30 గంటల సమయంలో మదనపల్లె టౌన్ నక్కలదిన్నెకు చెందిన తుమ్మల సురేశ్, పెద్దమండెం మండలం వెలిగల్లుకు చెందిన పూజారి నరేశ్, మదనపల్లె టౌన్ నక్కల దిన్నెకు చెందిన సయ్యద్ బషీద్‌అలీ, షేక్. అష్రఫ్‌బాషా, పెద్దమండెం మండలం వెలిగల్లుకు చెందిన షేక్ మహమ్మద్‌జాఫర్ కలిసి కలకడ మండలం కదిరాయచెరువు గ్రామం వడ్డపల్లెకు సమీపంలోని పొలంలో రేకుల షెడ్డులో నిద్రిస్తున్న ఉసిరికాయల రామచంద్రపై ఇనుప రాడ్లతో దాడి చేసి హత్య చేశారని వివరించారు. కలకడ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎస్ఐ రామకృష్ణారెడ్డి, కేవీపల్లి ఎస్ఐ ఎస్కే రహీముల్లా, హెడ్ కానిస్టేబుల్స్ హరిబాబు, రమేశ్‌కుమార్, సునీల్‌శశికుమార్, రెడ్డిబాబు, నాగరాజ, కానిస్టేబుల్ యునస్, ఇమ్రాన్, రాంమోహన్, కరుణాకర్, రియాజ్, రమేశ్, యోగేశ్, లక్ష్మినారాయణ, కేవీపల్లి పోలీస్ కానిస్టేబుల్స్ ధన, మోహన్‌కుమార్, హోంగార్డ్స్ సంజీవ, మురళి, రమేశ్‌లతో పాటు టెక్నికల్ వింగ్ రవి బృందం శుక్రవారం ఉదయం 6 గంటల సమయంలో గుర్రంకొండ మండలం రాయచోటి-మదనపల్లె రోడ్డులోని కలకడ క్రాస్ వద్ద నిందితులను అరెస్టు చేసి వారి నుంచి హత్యకు ఉపయోగించిన రెండు రాడ్లతో పాటు మూడు ద్విచక్రవాహనాలను, ఆరు సెల్‌ఫోన్‌లు, రూ.17,080 నగదును స్వాధీనం చేసుకున్నారన్నారు. నిందితులను కోర్టులో హాజరు పెట్టినట్లు ఎస్పీ వివరించారు. హత్య కేసును ఛేదించడంలో కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించి రివార్డులు అందజేశారు.

పులిపిరికి అరుదైన చికిత్స

» ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు



పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

కడప జిల్లా : ఆగస్టు 09: పులిపిర్లకు వడియార మల్లికార్జున అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకుపసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. కడప జిల్లా, కొత్త బస్‌స్టాండ్ ప్రక్కన ఎస్.పి.బంగ్లా ఎదురుగా, హరిత హోటల్, ఎపి టూరిజం కడప నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 09, 10, 11 తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. శని, ఆది రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లులోని సంప్రదించాలన్నారు.

శిక్షణను విజయవంతం చేయాలి

●12 నుంచి సర్పంచులకు, కార్యదర్శులకు శిక్షణ ● జడ్పీ సీఈవో

కడప(రూరల్) ఆగస్టు 9: జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ఆధ్వర్యంలో సర్పంచులకు, గ్రేడ్-1 నుంచి గ్రేడ్-5 వరకు పంచాయతీ కార్యదర్శులకు మండల స్థాయి శిక్షణను విజయవంతం చేయాలని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ప్రిన్సిపాల్, జడ్పీ సీఈఓ ఎం.సుధాకర్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్, డీపీఓ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీలో శిక్షణ నిర్వహణపై నిర్వహించిన అవగాహన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖల ఆదేశాల మేరకు ఆగస్టు 12 నుంచి 14 వరకు శిక్షణను నిర్వహిస్తున్నారన్నారు. 2024-25 వార్షిక కార్యాచరణ ప్రణాళిక ప్రకారం అన్ని శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఒక బ్యాచ్‌లో 40 నుంచి 50 మంది సభ్యులు ఉండాలన్నారు. ఎక్స్‌పర్ట్ రిసోర్స్ పర్సన్ చేత శిక్షణ ఇప్పించాలన్నారు. ప్రతి శిక్షణకు కోర్సు డైరెక్టర్, అసిస్టెంట్ కోర్సు డైరెక్టర్, ఈఓపీఆర్‌డీ ఉండాలన్నారు. ట్రైనింగ్ ప్రణాళికా ప్రకారం జరిగేలా ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీలు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. శిక్షణలో ఎల్‌సీడీ ప్రొజెక్టర్ విత్ స్క్రీన్, సౌండ్ సిస్టమ్, డెస్క్‌టాప్ కంప్యూటర్, వైట్ బోర్డు, భోజన వసతి, తదితర సదుపాయాలను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామపంచాయతీ విధులు, బాధ్యతలు, పంచాయతీరాజ్ చట్టం-1994, పారిశుధ్య నిర్వహణ-గ్రామపంచాయతీల పాత్ర, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల నిర్వహణ, స్ట్రీట్ లైట్ల వినియోగం తదితర వాటిపై శిక్షణ ఉంటుందన్నారు. ఇందుకుగాను ప్రతి మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రటరీలు శిక్షణను సద్వినియోగం చేసుకుని పంచాయతీల అభివృద్ధికి పాటుపడేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలోని ఎంపీడీఓలు, ఏఓలు, ఈఓపీఆర్‌డీలుపాల్గొన్నారు.

నేడు గండిలో మొదటి శ్రావణ శనివారం

చక్రాయపేట, ఆగస్టు 9: గండి దేవస్థానంలో జరిగే శ్రావణ మాసోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ ఏడాది గండికి భక్తులు భారీగా వస్తారని, అందుకు తగ్గట్లు ఏర్పాట్లు పూర్తిచేశారు. మంచినీరు, క్యూలు, డెకరేషన్లు, విద్యుత్ అలంకరణలు, షామియానాలు, కళాక్షేత్రం, ఔట్‌పోస్టు, వైద్య సదుపాయంతోపాటు తదితర అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. పారిశుధ్యం కోసం టీటీడీ నుంచి 50 మంది సులభ్‌వారు వచ్చారు. పాపాఘ్ని నదిలో స్నానఘట్టాలు, షవర్లు ఏర్పాటు చేశారు. అలాగే దేవస్థానం ఆవరణలో విద్యుత్ అలంకరణలతో ప్రతిమలు ఏర్పాటు చేశారు. సీఐ గోవిందరెడ్డి, ఎస్ఐ రంగనాథ్‌తో పాటు వందమంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణం అంతా పూల అలంకరణలు చేశారు. ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేశ్‌లు పూజా కార్యక్రమాలకు ఏర్పాట్లుచేశారు.

12 నుంచి వైవీయూ డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షలు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 9: వైవీయూ డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షలు ఈ నెల 12 నుంచి ప్రారంభం అవుతాయని వైవీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ ఈశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. అన్ని పరీక్షలు వైవీయూ క్యాంపస్‌లో నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు చదువుతున్న కళాశాలల నుంచి హాల్‌టికెట్లు తీసుకోవాలన్నారు. పరీక్ష టైంటేబుల్ కూడా అక్కడ లభిస్తుందని పరీక్ష ప్రారంభమయ్యే సమయానికంటే అర్ధగంట ముందే సెంట్రల్ లైబ్రరీ పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు.

జూదరుల అరెస్ట్ : రూ.15,280 నగదు స్వాధీనం

సుండుపల్లె, ఆగస్టు9: జూదమాడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్లు సుండుపల్లె ఎస్ఐ ఎస్కేఎం హుస్సేన్ శుక్రవారం తెలిపారు. మండలంలోని ముడుంపాడు గ్రామ పంచాయతీ రెడ్డివారిపల్లె సమీపంలో పేకాట ఆడుతుండగా దాడి చేసి రూ.15,280 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. పేకాట, బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు తమకు సహకరించాలని కోరారు.

బంగారు వ్యాపారి అశోక్‌కుమార్‌రెడ్డి ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 9 : విషగుళికలు తిని అశోక్‌కుమార్‌రెడ్డి (35) అనే బంగారు వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. అశోక్‌కుమార్‌రెడ్డి ప్రొద్దుటూరులో బంగారు దుకాణం పెట్టుకుని వ్యాపారం చేస్తున్నాడు. నాలుగేళ్ల క్రితం నిహారిక అనే మహిళతో వివాహం అయింది. వీరికి కుమార్తె పుట్టింది. కొంత కాలంగా అతను ప్రతి విషయానికి కుటుంబ సభ్యులపై కోపం తెచ్చుకునేవాడు. రోజుల తరబడి అన్నం కూడా తినకుండా ఎవరితోనూ మాట్లాడేవాడు కాదు. ఈ నేపథ్యంలో భార్య నిహారికను పుట్టింటికి పంపాడు. గదిలో రాత్రి పడుకున్న అతను శుక్రవారం ఉదయం పొద్దుపోయినా లేవకపోవడంతో కుటుంబసభ్యులు ఇంట్లోకి వెళ్లి చూడగా నేలపై పడిపోయి కనిపించాడు. వెంటనే ఆస్పత్రికి తీసుకుపోగా అప్పటికే అతను చనిపోయాడు. మానసిక క్షోభతో అశోక్‌కుమార్‌రెడ్డి విషగుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులు పోలీసులకు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలియజేశారు.

ఉరివేసుకుని నాపరాయి కూలీ...


ఎర్రగుంట్ల, ఆగస్టు 9: ఎర్రగుంట్లలోని శాంతినగర్‌కు చెందిన వీరప్రతాప్(25) శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నాపరాయి కూలీగా పనిచేస్తున్న ఇతనికి తాగుడు అలవాటు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో భార్యతో ఆయనకు మనస్పర్థలున్నాయి. ఆమె ఇటీవలే పుట్టింటికి వెళ్లింది. గురువారం వీరప్రతాప్ అత్తగారింటికి వెళ్లి రాత్రికి తిరిగి వచ్చాడు. శుక్రవారం ఉదయం వీరప్రతాప్ ఇంటి వద్దకు అతని అన్న వెళ్లి చూడగా అప్పటికే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



రామాపురం, ఆగస్టు9: మండలంలోని చిట్లూరు పంచాయతీ పాలన్నగారిపల్లె వంక వద్ద శుక్రవారం అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు రామాపురం ఎస్ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఢిల్లీ స్వాతంత్ర్య వేడుకలకు ఆర్ట్స్ కళాశాల విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జి.రవీంద్రనాద్ తదితరులు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 9: ఢిల్లీ ఎర్రకోటలో జరిగే 78వ స్వాతంత్ర్య దినోత్సవాలకు ప్రభుత్వ పురుషుల కళాశాల విద్యార్థి ఎన్.అశోక్ ఎంపికయ్యారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగే వేడుకలకు హాజరు కానున్నారు. ఈ వేడుకలకు కేంద్ర యువజన సర్వీసులు క్రీడామంత్రిత్వశాఖ నుంచి విద్యార్థికి ఆహ్వానం లభించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రనాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేశ్, ఎన్ఎస్ఎస్ పీఓ శివరామక్రిష్ణ, డాక్టర్ అంకాల నాగరాజు, డాక్టర్ లీలావర్థిని విద్యార్థిని అభినందించారు.

ఆలయ సేవా ట్రస్టు వద్ద రూ.2.03 కోట్ల నిధులు

నందలూరు, ఆగస్టు 9: సౌమ్యనాథస్వామి ఆలయ సమీపంలోని సౌమ్యనాథ సేవాట్రస్టు వారి నిధులు వివిధ బ్యాంకుల్లో రూ.2,03,50,735లు ఉన్నాయని ట్రస్టు ఛైర్మన్ యెద్దల సుబ్బరాయుడు తెలిపారు. శుక్రవారం బోర్డు సమావేశం నిర్వహించి ట్రస్టు ఆదాయ వ్యయాలు పరిశీలించి ఆమోదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్టుకు విరాళాలు అందజేసి సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. అన్నదానంతో పాటు ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను కూడా ఈ సంవత్సరంలో చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ట్రస్టు ఆర్థిక అభివృద్ధికి, అన్నదాన కార్యక్రమాన్ని విస్తృతం చేయడానికి చర్చించి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఈ సమావేశంలో కోశాధికారి చక్రాల రామసుబ్బన్న, కార్యదర్శి శైలేంద్రనాద్, సభ్యులు పాల్గొన్నారు.



విద్యుదాఘాతంతో గేదె మృతి

సిద్దవటం, ఆగస్టు 9 : విద్యుదాఘాతంతో లింగంపల్లె గ్రామస్థుడు వెంకట సుబ్బయ్య అనే రైతుకు చెందిన గేదె మృతి చెందింది. గ్రామంలోని విద్యుత్ స్తంభం వద్ద గడ్డి మేస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని, ఈ మధ్యనే ఈ గేదెను రూ.60 వేలు ఖర్చు చేసి కొనుగోలు చేసినట్లు బాధితుడు తెలియజేశాడు. ప్రభుత్వం సాయం అందించి తన కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన తెలియజేశారు.

సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

రామాపురం, ఆగస్టు 9: గ్రామీణాభివృద్ధిపై సర్పంచులు , పంచాయతీ కార్యదర్శులకు ఈ నెల 12నుంచి మూ డు రోజులపాటు శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీవో ప్రభాకర్ తెలిపారు. గ్రామ పంచాయతీ విధులు, నిధులు, బాధ్య తలు, గ్రామ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ ఉంటుంద న్నారు. కనుక సర్పంచులు, గ్రామ కార్యదర్శులు తప్పక సమావేశానికి హాజరుకావాలని ఆయన అన్నారు.

ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించండి

పుల్లంపేట, ఆగస్టు 9 : ప్రజా సమస్యలపై స్పందించి వెంటనే వాటిని పరిష్కరించాలని రాజంపేట సబ్‌కలెక్టర్ వైఖోమ్ నిధియాదేవి సూచించారు. శుక్రవారం ఆమె పుల్లంపేట తహసీల్దారు కార్యాలయం సందర్శించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. పలు సమస్యలపై కార్యాలయాలకు వచ్చే అర్జీదారుల పట్ల మర్యాదగా వ్యవహరించి నిష్పక్షపాతంగా విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. వివిధ రకాల సరిఫికెట్ల కోసం వచ్చేవారికి ఆలస్యం చే యకుండా మంజూరు చేయాలన్నారు. ఎంపీడీవో నరసింహమూర్తి, హౌసింగ్ ఏఈలతో సమావేశయ్యారు. ఈ కార్యక్రమంలో డీటీ లక్ష్మీప్రసన్న, ఎంఆర్‌ఐ నవీన్, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ

రాజంపేట: రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిని సబ్‌కలెక్టర్ వైఖోమ్ నిధియాదేవి తనిఖీ చేశారు. డయాలసిస్ సెంటర్‌లో వైద్యులు లేరని, యూరాలజిస్ట్ కూడా అందుబాటులో లేరని , డయాలసిస్ చేయించుకున్నవారికి మూడు నెలలుగా పెన్షన్ అందడం లేదని నూనెవారిపల్లెకు చెందిన సురేష్ సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో డయాలసిస్ సెంటర్ మేనేజర్‌ను అడిగి పించను రాకపోవడానికి కారణాలు తెలుసుకున్నారు. వెంటనే పెన్షన్ అందేలా చూడాలని ఆమె ఆదేశించారు. ఈ సమస్యలపై ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ప్రశ్నించేందుకు ఆయన చాంబర్‌కు వెళ్లగా ఆయన అందుబాటులో లేకపోవడంతో ఇన్‌చార్జి డాక్టర్ అనీల్‌కుమార్‌తో ఆసుపత్రిలోని సమస్యలను తెలుసుకున్నారు.


రెవెన్యూ సిబ్బందితో సమావేశమైన రాజంపేట సబ్‌కలెక్టర్ వైఖోమ్ నిధియాదేవి

కేజీబీవీలో జడ్జి తనిఖీ

చక్రాయపేట, ఆగస్టు 9: మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాన్ని లక్కిరెడ్డిపల్లె జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌కె ఫైజున్నిసా శుక్రవారం అకస్మికంగా తనిఖీ చేశారు. భవనాలు నివాసయోగ్యంగా ఉన్నాయా లేవా అని పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. ప్రిన్సిపాల్, బోధన, బోధనేతర సిబ్బందితో మాట్లాడారు.

సక్రమంగా వసతులు కల్పించకపోతే చర్యలు

ఓబులవారిపల్లె, ఆగస్టు 9 : మండలంలోని చిన్నఓరంపాడు పరిధిలో ఉన్న కేజీబీవీని రైల్వేకోడూరు జూనియర్ సివిల్‌కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి విజయలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో సమావేశమై మౌలిక వసతులపై చర్చించారు. పాఠశాల, హాస్టల్‌లో వసతులు సక్రమంగా లేవని, భోజనం సక్రమంగా వడ్డించడంలేదని తెలిపారు. రాత్రివేళల్లో తామే వండుకుని తింటున్నామని విద్యార్థినులు వివరించారు. పాఠశాల ప్రాంగణంలో సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామని తెలియజేశారు. ఈ సమస్యలన్నింటినీ వారం రోజుల్లోపు ఏర్పాటు చేయాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌తో న్యాయమూర్తి ఫోన్లో మాట్లాడారు. సరైన వసతులు కల్పించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

డ్వాక్రా లోన్లతో ఆర్థిక ప్రగతి సాధించాలి

చిట్వేలి, ఆగస్టు 9 : డ్వాక్రా రుణాలతో ఆర్థిక ప్రగతి సాధించాలని వైడీపీ ఏపీఎం రామచంద్ర అన్నారు మండలంలోని సిద్దారెడ్డిపల్లె పంచాయతీ మల్లాలమ్మ ఎస్టీ కాలనీలో డ్వాక్రా మహిళలతో ఆయన మాట్లాడారు. రుణాలు సక్రమంగా చెల్లించడం వల్ల అటు సంఘం, ఇటు కుటుంబంతోపాటు రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని వివరించారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

నందలూరు, ఆగస్టు 9 : నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 200 మంది విద్యార్థులకు కంటి వైద్యనిపుణుడు డాక్టర్ వి.చంద్రశేఖర్‌రెడ్డి కంటి పరీక్షలు నిర్వహించారు. తీవ్రమైన దృష్టిలోపం ఉన్న 8 మంది విద్యార్థులను గుర్తించారు వీరికి కంప్యూటర్ ద్వారా ప్రత్యేక కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పీహెచ్‌సీ అధికారి వి.లక్ష్మయ్య, ఏఎన్‌ఎం అంజనాదేవి, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎస్.కృష్ణయ్యపాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు స్కాట్ విద్యార్థులు

నందలూరు, ఆగస్టు 9 : నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8, 9 తరగతులు చదువుతున్న ఫర్హాన్, పునీష్, రాఘవేంద్ర, నవీన్ రాయచోటి పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో జరగబోయే స్వాతంత్ర్య దినోత్సవాల్లో పాల్గొనేందుకు ఎంపికై నట్లు హెచ్‌ఎం జయలలితకుమారి తెలిపారు. వీరు ఈనెల 7 నుంచి 14వ తేదీ వరకు రాయచోటి పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో శిక్షణ తరగతులకు హాజరవుతున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

సుండుపల్లె, ఆగస్టు 9: పీలేరు డిపో నుండి సుండుపల్లె మీదుగా రాజంపేట బస్సు సర్వీసును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. శనివారం ఉదయం సుండుపల్లె మండల కేంద్రంలో టెంకాయ కొట్టి బస్సు సర్వీసును ప్రారంభించారు. ఎంపీపీ రాజమ్మ, సుబ్బరామరాజు, జనసేన నాయకులు రామాశ్రీనివాసులు, రెడ్డిరాణి తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

పెనగలూరు, ఆగస్టు 9 : సమస్యలు పరిష్కరించాలని ఆటో వర్కర్స్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం బెస్తపల్లె కూడలిలో ఆటో వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రాధాకృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి ఎంఎస్‌రాయుడు, రాజంపేట డివిజన్ కార్యాదర్శి సికిందర్ మాట్లాడుతూ డీజిల్ ధరలు తగ్గించాలని, స్థానిక బస్టాండ్ కూడలిలో ఆటో స్టాండ్ ఏర్పాటు చేయించాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, కొత్త చట్టాలను రద్దు చేయాలని తదితర డిమాండ్లు చేశారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థి ఆర్థిక సాయం

రైల్వేకోడూరు(రూరల్) ఆగస్టు 9: తాను చదువుకున్న పాఠశాలకు పూర్వ విద్యార్థి ప్రకాష్ ఆర్థిక సహకారం అందించారు. శుక్రవారం పట్టణంలోని మెయిన్ స్కూల్ 1984-89 బ్యాచ్ విద్యార్థిలు పాఠశాలలో పూర్వ విద్యార్థుల కలయిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన పాఠశాలకు ఇనుప గేట్ ఏర్పాటు కోసం ఆర్థిక సాయం అందించారు. అనంతరం మిత్రులు ఆయనను ఘనంగా సన్మానించారు.

బలిజలు బలమైనశక్తిగా ఎదగాలి

పుల్లంపేట, ఆగస్టు 9 : రాష్ట్రంలో బలిజలంతా ఏకమై శక్తిగా ఎదగాలని బలిజసేన రాష్ట్ర కార్యదర్శి ఎద్దల అనంతరాయలు పిలుపునిచ్చారు. శుక్రవారం పుల్లంపేటలోని బలిజసేన అధ్యక్షుడు పసుపులేటి సుబ్బయ్య స్వగృహంలో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నీలి ఈశ్వరయ్య, పుల్లంపేట మండల అధ్యక్షులు పంచగల వెంకటసుబ్బయ్య, కంబాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె పురపాలక సంఘము

ఈ- ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

ఆర్.ఓ.సి.నెం. 1394/E1/2020 తేది: 08-08-2024

మదనపల్లె పురపాలక సంఘము నందు క్రింద తెలిపిన పనులకుగాను ఈ- ప్రొక్యూర్‌మెంటు ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనది.

వ. నెం.	Funds	Tender ID Nos.	పనుల సంఖ్య	పనుల అంచనా మొత్తము (ECV)
1.	General Funds	747377, 747505, 747595, 747597, 747601, 747602, 747605, 747613, 747619, 747622, 747662, 747667, 747671, 747674, 747679, 747694, 747699, 747702, 747705, 747817, 747818, 747826, 747830, 747836, 747839, 747840, 747844, 747846, 747848, 747865, 747867, 747870, 747875	33	217.61 లక్షలు

పై పనులకు సంబంధించిన పూర్తి వివరముల కొరకు వారి e procurement market place నందు చూడవలెను మరియు ఆఫీసు పని వేళలయందు సంబంధిత అధికారులను సంప్రదించగలరు.

బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ చేసుకొనుటకు మొదలుతేది : 08-08-2024 ఉ॥11.00గం॥లకు
బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ చేసుకొనుటకు చివరితేది : 22-08-2024 ఉ॥11.00గం॥లకు
బిడ్ డాక్యుమెంట్ స్వీకరించుటకు చివరి తేది : 22-08-2024 ఉ॥11.15గం॥లకు

షరతులు : ఏ కారణము తెలుపకుండా టెండరును పాక్షికముగా కాని, పూర్తిగా కాని రద్దుపరచుటకు/నిరాకరించుటకు కమీషనరు వారికి పూర్తి అధికారములు కలవు.

సం/- **కమీషనర్**, మదనపల్లె పురపాలకసంఘం

వైభవంగా రాములోరి గ్రామోత్సవం

రామాపురం, ఆగస్టు 9: మండలంలోని కల్పనాయుని చెరువు పంచాయతీ అగ్రహారంలో ని ఆలయంలో ప్రతిష్ఠించనున్న సీతారామలక్ష్మణుల మూలవిరాట్‌లు, ఉత్సవ మూర్తులను శుక్రవారం గ్రామంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

వేడుకగా విగ్రహ ప్రతిష్ఠ

పెనగలూరు, ఆగస్టు 9: పి.కొత్తపల్లె కార్యసిద్ధి వినాయకస్వామి దేవాలయంలో శుక్రవారం తలమంచి రమణారెడ్డి, చంద్రకళ దంపతుల ఆధ్వర్యంలో వినాయకుడి మూలవిరాట్, ద్వారపాలకులు, శిఖరకలశం, బ్రహ్మ, విష్ణు మహేశ్వరుల రాతి విగ్రహాలు ప్రతిష్ఠించారు. అన్నప్రసాద వితరణ చేశారు.

నేడు సీతారాముల కల్యాణం

సుండుపల్లె, ఆగస్టు 9: మండలంలోని సొంఠంవారిపల్లె గ్రామ పంచాయతీ గడ్డమీదపల్లెలో శనివారం సీతారామచంద్రస్వామి, లక్ష్మణ, హనుమ విగ్రహాల ప్రతిష్ఠ, సీతారాముల కల్యాణోత్సవం చేస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ఉదయం ఆలయ ప్రదక్షిణ, విగ్రహ, ప్రతిష్ఠ కల్యాణ అనంతరం తీర్థప్రసాదాల వితరణ ఉంటుందన్నారు. అనంతరం అన్నదానం చేస్తున్నామన్నారు.

రాజంపేటను అభివృద్ధి పథంలో నడిపించండి

రాజంపేట, ఆగస్టు 9 : రాజంపేటను అభివృద్ధిపథంలో నడిపించాలని రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను తెలుగుదేశంపార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ మల్లెల శ్రీవాణి కోరారు. విజయవాడ సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె మాట్లాడుతూ మున్సిపల్ పట్టణ అభివృద్ధికి నిధులు కేటాయించి రోడ్ల డ్రైనేజీతోపాటు రాజంపేట గర్ల్స్ హైస్కూల్లో అధ్యాపకుల కొరత ఉందని, సిబ్బందిని నియమించి హైస్కూల్ బిల్డింగ్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి

చిన్నమండెం, ఆగస్టు 9: ప్రభుత్వ పథకాలు ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని ఉపసంచాలకులు డాక్టర్ మాలకొండయ్య రైతులకు సూచించారు. మండల కేంద్రంలోని స్థానిక పశువైద్య కార్యాలయాన్ని రాయచోటి పశుసంవర్థకశాఖ ఉప సంచాలకులు మాలకొండయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మొక్కజొన్నలు 1950 కేజీలు, గడ్డిజొన్నలు 1750 కేజీలు 73 శాతం రాయితీతో పం పిణీకి సిద్ధంగా ఉన్నట్లు తెలియజేశారు. ఈ నెల 20వ తేదీ నుంచి పశువులకు గాలి కుంటు టీకాలు, ఈసుకు పోయే వ్యాధి నివారణ టీకాలు వేస్తామని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

బొప్పాయి రైతులకు నష్టపరిహారం చెల్లించాలి...

రాయచోటి (కలెక్టరేట్)ఆగస్టు9: నాసిరకం బొప్పాయి నారుతో నష్టపోయిన రైతులకు 2 లక్షలు నష్టపరిహారం ఇప్పించడంతోపాటు, నర్సరీ యాజమానులపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి పి.జమలయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరికి ఫిర్యాదు చేశారు. అంతకు ముందు కలెక్టర్ కార్యాలయం ముందు రైతులతో కలసి నిరసన వ్యక్తం చేశారు.



గిరిజన వసతి గృహంలో విజృంభిస్తున్న జ్వరాలు




ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు - చికిత్స పొందుతున్న మీర్జేపల్లె విద్యార్థి పద్మజ

పుంగనూరు, ఆగస్టు9: పుంగనూరులోని గిరిజన వసతి గృహంలో జ్వరాలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజుల క్రితం ఓ విద్యార్థి డెంగ్యూ జ్వరంలో మృతి చెందగా ప్రస్తుతం నలుగురు విద్యార్థులు జ్వరాలతో ఇబ్బందులు పడుతూ పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. పదవ తరగతి చదువుతున్న దేవయాణి, వైష్ణవి, జ్యోతిలు రెండు రోజులుగా ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. విద్యార్థులు మాట్లాడుతూ వసతి గృహం చుట్టూ పారిశుధ్యం లోపంతో దోమల కుట్టడం వల్ల తమకు జ్వరాలు సోకినట్లు వాపోయారు. సంబంధింత అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు పారిశుధ్యం పనులు నిర్వహించి దోమల బారినుంచి కాపాడాలని విద్యార్థులు కోరుతున్నారు. అలాగే మండలంలోని వనమలదిన్నె పంచాయతీ మీర్జేపల్లెలో విషజ్వరాలు ప్రబలి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో పారిశుధ్య లోపంతోనే జ్వరాలు సోకినట్లు తెలిపారు. గ్రామంలోని గంగరాజు కుమార్తె పద్మజ(8), పద్మశ్రీలకు జ్వరాలు సోకి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పద్మజకు డెంగ్యూ జ్వరంగా డాక్టర్లు నిర్ధారించి మెరుగైన చికిత్స కోసం తిరుపతికి పంపుతున్నట్లు వివరించారు. అధికారులు గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

గుత్తార్లపల్లెలో చెరువు ఆక్రమిత భూమికి విముక్తి



బచ్చెని చెరువును వద్ద అక్రమదారులు



ఆక్రమిత భూమిలో ఎక్స్‌కవేటర్‌తో తవ్వుతున్న కందకాలు

గుడుపల్లె, ఆగస్టు 9: మండల పరిధిలోని గుండ్లసాగరం పంచాయతీ గుత్తార్లపల్లెకు చెందిన బచ్చెని చెరువు ఆక్రమిత భూమికి ప్రజల ఫిర్యాదుతో ఎట్టకేలకు శుక్రవారం విముక్తి లభించింది. గుత్తార్లపల్లెకు కిలోమీటర్ దూరంలో సర్వే నెంబరు 63లోని ఈ చెరువు విస్తీర్ణం 5.04 ఎకరాలుగా రెవెన్యూ రికార్డుల్లో ఉంది. దశాబ్దకాలంగా చెరువు ఆక్రమణలకు గురై కొందరు పంటలు సాగు చేశారు. ఆక్రమణలు పోను మూడు ఎకరాలు మిగిలింది. ఈనెల 5వ తేదీన కుప్పం తహసీల్దార్ కార్యాలయంలో కడా పీడీ వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో గుత్తార్లపల్లెకు చెందిన బచ్చెని చెరువు ఆక్రమణల గురించి పలువురు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. చెరువును సర్వే చేసి ట్రెంచ్ ఏర్పాటు చేయాలని కడా పీడీ తహసీల్దార్‌కు ఆదేశాలు జారీచేశారు. దీంతో రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు చెరువు భూమిని సర్వే చేయడానికి శుక్రవారం బచ్చెని చెరువుకు చేరుకొన్నారు. ఆక్రమణదారులు సర్వేను అడ్డుకోవడానికి సిద్ధపడ్డారు. సర్వేకు అడ్డుతగిలితే కేసులు నమోదు చేసామని డీటీ కిరణ్‌కుమార్ నాయక్ హెచ్చరించారు. ఆక్రమణదారులు వెనకడుగు వేయడంతో సర్వేయర్ జయంత్, వీఆర్వో కుమార్, వీఆర్ఏలతో చెరువును సర్వే చేశారు. సుమారు 2 ఎకరాల భూమి ఆక్రమణకు గురైనట్లు వారు గుర్తించారు. అనంతరం ఆక్రమిత చెరువు భూమిలో ఎక్స్‌కవేటర్‌తో కందకాలు తవ్వించారు. ఎట్టకేలకు బచ్చెని చెరువు భూమి ఆక్రమణల నుంచి విముక్తి కలగడంతో గ్రామస్తులు సీఎం చంద్రబాబు పాలనపై గ్రామస్తులు ప్రశంసల వర్షం కురిపించారు.

రికవరీ ఇబ్బందులుంటే సహకరిస్తా : జేసీ



బ్రాంచ్ మేనేజర్ల సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 9: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా అందించిన రుణాల రికవరీలో ఇబ్బందులుంటే రెవిన్యూ శాఖ తరఫున సహకారమందిస్తామని జేసీ, బ్యాంకు అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి పి.శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం బ్యాంకు ప్రధాన కార్యాలయంలో డీసీసీబీ జిల్లా స్థాయి బ్రాంచ్ మేనేజర్ల సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఐదు శాతం ఉన్న రూ.100 కోట్ల నిరర్ధక ఆస్తులను ప్రస్తుత వార్షిక సంవత్సరాంతంలోగా రెండు శాతానికి తగ్గించాలన్నారు. 2024-25లో బ్యాంకు రుణ పంపిణీ రూ.2,500 కోట్లుగా నిర్దేశించగా, గత నెలాఖరు వరకు రూ.2000 కోట్లు అందించిందని తెలిపారు. ఈ ఏడాది డిపాజిట్ల లక్ష్యం రూ.1,114 కోట్లు కాగా ఇంతవరకు రూ.908.46 కోట్లు సేకరించిందని, మరింత పెంచాలని సూచించారు. అక్టోబరు కల్లా 75 వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో రికార్డులను కంప్యూటరీకరణ చేయాలని ఆదేశించారు. తొలుత బ్యాంకుకు విచ్చేసిన జేసీ శ్రీనివాసులుకు బ్యాంకు సీఈవో స్వాగతం పలికారు. బ్యాంకు జీఎంలు సి.శంకర్‌బాబు, లిల్లీకేథరిన్, డీజీఎంలు, ఏజీఎంలు పాల్గొన్నారు.

మామిడి బోర్డును ఏర్పాటు చేయాలి

● ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు సిటీ, ఆగస్టు9: జాతీయ మామిడి బోర్డును ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు కోరారు. శుక్రవారం ఢిల్లీలో పార్లమెంటు సమావేశాలకు హాజరైన ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆధ్వర్యంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర చౌదరి తదితరులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలసి వినతిపత్రం సమర్పించారు. తోతాపురి మామిడిని కనీస మద్దతు ధర జాబితాలో చేర్చాలని, సిండికేట్‌గా మారి మామిడి రైతులను దోచుకుంటున్న పల్ప్ ఫ్యాక్టరీ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కొనసాగుతున్న వర్షాలు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 9: జిల్లావ్యాప్తంగా వర్షాలు కొనసాగుతున్నాయి. గడచిన 24 గంటల్లో 17 మండలాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా విజయపురంలో 25.2, అత్యల్పంగా బైరెడ్డిపల్లిలో 0.8 మి.మీ వర్షపాతం నమోదైంది. గుడిపాల 18.0, వి.కోట 17.0, తవణంపల్లి 15.4, శ్రీరంగరాజపురం 14.4, పూతలపట్టు 12.4, చిత్తూరు 9.2, పాలసముద్రం 8.6, నగరి 7.8, సదుం 5.4, బంగారుపాళ్యం 5.4, గంగాధరనెల్లూరు 4.6, చిత్తూరు రూరల్ 3.6, యాదమరి 3.6, పలమనేరు 2.4, వెదురుకుప్పంలో 2.2 మి.మీ వర్షం కురిసింది.

సవరించిన మోటార్ వాహన చట్టంపై అవగాహన కల్పించాలి

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 9: మోటారు వాహనం చట్టంలోని సెక్షన్-200ను సవరిస్తూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులపై ప్రజలకు అవగాహన కల్పించాలని జేసీ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం జేసీ చాంబర్‌లో ఇందుకు సంబంధించి డిస్ట్రిక్ కన్స్యూమర్ ఇన్ఫర్మేషన్ సెంటర్ తయారు చేసిన పోస్టర్‌ను నేషనల్ కన్స్యూమర్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ చదలవాడ హరిబాబుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. జేసీ మాట్లాడుతూ కేంద్రం సవరించిన మోటార్ వాహన చట్టంలోని నూతన నిబంధనలు కఠినంగా ఉన్నాయని, అతిక్రమించిన వారికి శిక్షలు తప్పవని హెచ్చరించారు.

ఏపీఐఐసీ భూముల పరిశీలన



మహారాజపురంలో ఏపీఐఐసీ భూములను పరిశీలిస్తున్న అధికారులు

విజయపురం, ఆగస్టు 9: విజయపురం మండలం కోసలనగరం, మహారాజపురంలోని ఏపీఐఐసీ భూములను శుక్రవారం పరిశ్రమల శాఖ డైరెక్టర్ యువరాజు, కలెక్టర్ సుమిత్‌కుమార్‌పరిశీలించారు. మండలంలో పరిశ్రమల స్థాపనకు అవకాశాలను పరిశీలించినట్లు చెప్పారు. ఐపీఐఐసీ భూములు సిద్ధంగా ఉండడంతో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పరిశ్రమల ఏర్పాటుకు మౌళిక సదుపాయాల వివరాలను తెలుసుకున్నారు. రైతులకు పరిహారం అందించే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. అలాగే, మరో బ్లాకులో 470 ఎకరాలకు సంబంధించిన భూములను తీసుకోవడానికి భూ సేకరణ ప్రక్రియను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకటరెడ్డి, ఏపీఐఐసీ జెడ్ఎం చంద్రశేఖర్, తహసీల్దార్ కిరణ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

16న అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం

తిరుచానూరు, ఆగస్టు 9: తిరుచానూరు పద్మావతీ దేవి ఆలయంలో 16వ తేదీ వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తెల్లవారుజామున మూలవర్లకు, ఉత్సవర్లకు అభిషేకాలు నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆలయంలోని ఆస్థాన మండపంలో వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించనున్నారు.వ్రతంలో పాల్గొనే గృహస్థులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, లడ్డూ, వడ ఇవ్వనున్నారు. వ్రతం కారణంగా శుక్రవారం ఆలయంలో ఆర్జితసేవలైన అభిషేకం, అభిషేకానంతర దర్శనం, లక్ష్మీపూజ, కల్యాణోత్సవం, కుంకుమార్చన, వేదాశీర్వాదం, బ్రేక్ దర్శనం, సహస్ర దీపాలంకరణ సేవలను టీటీడీ రద్దు చేసింది.

ఘాట్ ప్రమాదంలో బస్సు డ్రైవర్ అరెస్ట్

తిరుమల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌లో జరిగిన బస్సు ప్రమాదంలో డ్రైవర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండో ఘాట్‌లోని చివరి మలుపు(తిరుమలకు జీఎన్సీ టోల్‌గేట్‌కు సమీపం ప్రాంతం)లో ఓ యువకుడు, యువతి బైక్‌పై ప్రయాణిస్తూ ముందు వెళుతున్న ఎలక్ట్రిక్ ఏసీ బస్సు కింద పడి ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. వీరిద్దరూ తమిళనాడులోని పళ్లిపట్టు తాలూక వెలియాగరం గ్రామానికి చెందిన ఏఎస్ కార్తీక్(28), తిరువణ్ణామలై జిల్లాలోని చెంజాం తాలూక మషర్ గ్రామానికి చెందిన సౌమ్య(21)గా గుర్తించి మృతదేహాలను కుటుంబీకులకు పోలీసులు అప్పగించారు. చెన్నైలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న వీరు ఒకరిని ఇష్టపడుతున్నట్టు తెలిసింది. వీరి ప్రేమ వ్యవహారం కుటుంబీకులకు కూడా తెలియదు. స్వామి దర్శనం చేసుకోవాలనే ఉద్దేశంతో వచ్చి దుర్మరణం చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ కాంతారావును అదుపులోకి తీసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో విచారించారు. బస్సు డ్రైవర్‌దే తప్పని తేలడంతో అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు. ఇక ఏసీ బస్సు ముందు, వెనుకభాగంలో కెమెరాలున్నా స్విచ్ వేయలేదని అధికారులు చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆ ఫుటేజ్ ఉంటే ప్రమాదం ఎలా జరిగింది, తప్పు ఎవరిదనే విషయాలు స్పష్టంగా అందరికీ తెలిసేవి.

కుప్పంలో సాంకేతిక విద్యాభివృద్ధికి ప్రణాళికలు



కడా అధికారులతో చర్చలు జరుపుతున్న సాంకేతిక శాఖాధికారులు

కుప్పం, ఆగస్టు 9: నియోజకవర్గ పరిధిలో సాంకేతిక విద్యావకాశాలు మరింత పెంపొందించడానికి అవసరమయ్యే అభివృద్ధి ప్రణాళిక గురించి కడా కార్యాలయంలో అధికారుల బృందం శుక్రవారం చర్చలు జరిపింది. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం రీజియన్‌కు సంబంధించిన రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఎ.నిర్మల్ కుమార్ ప్రియ, అసిస్టెంట్ డైరెక్టర్ బీజీ.వెంకటసుబ్బయ్య, డాక్టర్ జేమ్సియెన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎం.జగన్నాథరావులు చర్చలో పాల్గొని సాంకేతిక విద్యాభివృద్ధికి తాము రూపొందించిన ప్రణాళికలను కడా అధికారులకు అందజేశారు. నూతన కోర్సులైన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్, డేటా సైన్స్, రోబోటిక్స్ తదితర కోర్సులు పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభిస్తే విద్యార్థుల నైపుణ్యాలు పెరిగి, ఉపాధి ఉద్యోగావకాశాలు మెరుగుపడుతాయని ఈ ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. నూతన కోర్సుల ప్రారంభానికి పరిశ్రమల సహకారం తీసుకోవాలని సూచించారు.





జ్యోతి ప్రజ్వలన చేసి ఆదివాసీ దినోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మేయర్ అముద - చిన్నారుల నృత్య ప్రదర్శన

పిల్లలను బాగా చదివించండి

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి ● ఆదివాసీ దినోత్సవంలో డీఆర్వో పుల్లయ్య పిలుపు

చిత్తూరు, ఆగస్టు 9: గిరిజనులు తమ పిల్లలను చదివించడం వల్ల వారి కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా ఉన్నత స్థాయికి చేరుతాయని డీఆర్వో పుల్లయ్య అన్నారు. చిత్తూరులోని డీఆర్‌డీఏ సమావేశపు హాలులో శుక్రవారం జరిగిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని కోరారు. మేయర్ అముద, డ్వామా పీడీ రాజశేఖర్ మాట్లాడుతూ.. మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు బ్రిటీష్‌వారిపై పోరాడటంలో గిరిజనుల పాత్ర కీలకమైందని గుర్తుచేశారు. గిరిజనులు సమాజానికి దూరంగా కొండల్లో, అడవుల్లో జీవిస్తుంటారని, వారిని అన్ని రంగాల్లో ముందుకు తీసుకురావడం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అందుబాటులోకి తెచ్చిందన్నారు. గిరిజనులకు ఏవైనా సమస్యలుంటే ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్‌డేలో ఫిర్యాదు చేయాలన సూచించారు. మూడు నెలలకు ఒకసారి జిల్లాస్థాయిలో నిర్వహించే డీవీఎంసీ సమావేశంలోనూ సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. గిరిజనుల సమస్యలను ప్రస్తావించిన గిరిజన సంఘాల నాయకులు.. జిల్లా కేంద్రంలో గిరిజన భవనం కావాలని అధికారులను కోరారు. అనంతరం గిరిజన వయోవృద్ధులను అధికారులు సన్మానించారు. అంతకుముందు గిరిజన సంప్రదాయ నృత్యాలు, డప్పులతో అలరించాయి. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు చిరంజీవి, కృష్ణా నాయక్, మాలే గిరిధర్, మునీంద్ర నాయక్, జీవీ రమణ, ఆదినారాయణ, సుగుణమ్మ, డీవీఎంసీ సభ్యులు దేవరాజులు, రాజ్‌కుమార్, బాబు, మునస్వామి, ఇతర శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో రాష్ట్ర చీఫ్ కమిషనర్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్




శ్రీనివాస్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఈవో వెంకటేశు - దీపావెంకట్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి



వరసిద్ధుడి సేవలో సీసీఎల్ఏ జయలక్ష్మి

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 9: రాష్ట్ర చీఫ్ కమిషనర్ ల్యాండ్(సీసీఎల్ఏ) జయలక్ష్మి కుటుంబ సమేతంగా శుక్రవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. వారిని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఈవో వెంకటేశు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ పునర్నిర్మాణ దాతలలో ఒకరైన గుత్తికొండ శ్రీనివాసులు, స్వర్ణ భారత్ ట్రస్టు చైర్మన్ దీపావెంకట్ స్వామిని దర్శించుకున్నారు. ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు.

స్కావెంజర్ల జిల్లా కమిటీ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు, ఆగస్టు 9: మాన్యువల్ జిల్లా స్కావెంజర్ల సర్వే జిల్లా కమిటీ ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. ఈ కమిటీలో నలుగురు సభ్యులుంటారని, వారిలో మాన్యువల్ స్కావెంజర్స్ లేదా పారిశుధ్య కార్మికుల కోసం పనిచేసే ఇద్దరు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అలాగే వారి కోసం పనిచేసే సంఘాల్లోని ఇద్దరు ప్రతినిధులు ఉంటారని తెలిపారు. ఈ నలుగురిలో ఒకరు మహిళా సభ్యులు ఉంటారని వివరించారు. ఆసక్తి కలిగిన వారు పూర్తి వివరాలతో ఈనెల 13వ తేదీలోపు జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ, సాధికారిత కార్యాలయం, కలెక్టరేట్ ప్రాంగణం, చిత్తూరులో దరఖాస్తులను అందించాలని కోరారు. ఇతర వివరాలకు 9347739382ను సంప్రదించాలని కోరారు.

వైసీపీ భూ బాధితులతో కలసి ధర్నాలు

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



వయనాడ్ బాధితులకోసం సేకరించిన నిత్యావసర వస్తువుల లారీని జెండా వూపి పంపుతున్న నారాయణ తదితరులు

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు9: వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన భూ ఆక్రమణల బాధితులను ఏకం చేసి వారికి న్యాయం చేయడానికి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ పేర్కొన్నారు. తిరుపతిలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో భూముల రిజిస్ట్రేషన్ విధానం భూబకాసురులకు వరంగా మారిందన్నారు. మదనపల్లెలో వున్న భూములకు పులివెందులలో రికార్డులు తారుమారుచేసి రిజిస్ట్రేషన్ చేసుకున్న విషయాన్ని ప్రశ్నించిన వేంకటేశ్వరరావుపై గత ప్రభుత్వం కేసులు బనాయించిన విషయాన్ని గుర్తుచేశారు.తప్పుడు రికార్డులతో రిజిస్ట్రేషన్లు చేసుకున్న వారి భరతం పట్టడానికి భూబాధితులను ఏకంచేసి విశాఖపట్టణం నుంచి ఆందోళనలు ప్రారంభిస్తామన్నారు. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించి నిధులను గ్రాంట్ రూపంలో కేటాయించాలన్నారు. కేంద్రప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరించడాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశ్నించకపోవడం బాధాకరమన్నారు.మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రశ్నించకుండా ఢిల్లీలో ఆందోళనలు చేయడం అర్థరహితమని మండిపడ్డారు. ప్రజలు జగన్మోహన్‌రెడ్డిని గెలిపిస్తే, ఆయన ఆ ప్రజలకు దూరంగా ఢిల్లీ వెళ్ళి ఆందోళనలు చేయడం ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేయడమేనని విమర్శించారు.బంగ్లాదేశ్‌లో విద్యార్థుల ఉద్యమాన్ని సీపీఐ సమర్థిస్తోందన్నారు.అక్కడ ప్రజాస్వామ్యబద్ధంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అందరూ సహకరించాలన్నారు. ఎన్నికల్లో బ్యాలెట్ పేపరు విధానమే మంచిదన్నారు.వయనాడ్‌లో జరిగిన విపత్తును కేంద్ర ప్రభుత్వం జాతీయవిపత్తుగా గుర్తించి జాతీయవిపత్తు నిధినుంచి నిధులు కేటాయించాలని కోరారు.అంతకుముందు వయనాడ్ బాధితులకోసం సేకరించిన నిత్యావసర వస్తువుల లారీని ఆయన జెండా వూపి ప్రారంభించారు.సీపీఐ నాయకులు ఎ.రామానాయుడు, పి.హరినాథరెడ్డి, మురళి, పెంచలయ్య, రాధాకృష్ణ, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో గరుడసేవ



తిరుమల క్షేత్రంలో శుక్రవారం రాత్రి గరుడవాహన సేవ కన్నులపండువగా జరిగింది. గరుడపంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని మలయప్పస్వామి తన ఇష్టవాహనమైన గరుడిడిపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు నాలుగు మాడవీధుల్లో శ్రీవారు ఊరేగారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యామ్‌సుందర్, టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో శ్రీధర్, డిప్యూటీఈవో లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

-తిరుమల, ఆంధ్రజ్యోతి



రావి,వేప వృక్షాలకు కల్యాణం

ఎర్రావారిపాలెం మండలం కమ్మళ్ళ కూడలి సమీపంలోని రావి, వేప వృక్షాలకు శుక్రవారం ఉదయం కల్యాణం జరిపించారు.కమళ్ళయ్యగారి పల్లెకు చెందిన వాసు చాలా సంవత్సరాలుగా గ్రామస్తులతో కలిసి రావి, వేప చెట్లకు పెండ్లి జరిపిస్తున్నారు. ఈ క్రమంలో శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం ఉదయం పురుషోత్తం, అరుణ దంపతులు వరుడి కుటుంబం(రావి) తరఫున, జయరామయ్య, గీత దంపతులు వధువు (వేప)కుటుంబం తరఫున పట్టు వస్త్రాలు ధరించి పెండ్లి పీటలపై ఆశీనులయ్యారు.వేదపండితులు సాయి వర్మ కళ్యాణ తంతు నిర్వహించారు.అనంతరం గ్రామస్తులకు విందు భోజనం వడ్డించారు.

- ఎర్రావారిపాలెం

అటాచ్‌మెంట్ ఆదేశాలతో వెళ్లి తిరిగొచ్చిన పోలీసులు

కలికిరి, ఆగస్టు 9: గత వైసీపీ ప్రభుత్వంలో నాయకుల ఆగ్రహానికి గురై కలికిరి నుంచి వెళ్లిన ఇద్దరు పోలీసులు తిరిగి డ్యూటీలో చేరారు. కలికిరిలో పనిచేస్తున్న ఏఎస్ఐ మధుసూదనాచారి, హెడ్ కానిస్టేబుల్ మనోహర్‌లను పెద్దమండ్యం, రామసముద్రం పోలీసు స్టేషన్‌లకు అటాచ్ చేస్తూ ఇక్కడి నుంచి పంపేశారు. అధికార పార్టీ నాయకులకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారనే ఆరోపణలతో వారిద్దరినీ బదిలీపై కాకుండా అటాచ్‌మెంట్ ఆదేశాలతో పంపేశారు. తమకు జరిగిన అన్యాయాన్ని జిల్లా అధికారులకు విన్నవించడంతో సానుకూలంగా స్పందించిన ఎస్పీ అటాచ్‌మెంట్ ఆదేశాలను రద్దు చేసి యథాతథంగా కలికిరి స్టేషన్‌లో పని చేసేందుకు అవకాశమిచ్చారు. దీంతో శుక్రవారం ఈ ఇద్దరూ యథాతథంగా కలికిరి స్టేషన్‌లో విధుల్లో చేరారు.

పరిశుభ్రత పాటిస్తే ప్రోత్సాహకాలు

మదనపల్లె టౌన్, ఆగస్టు 9:గ్రామ పంచాయతీలో పరిశుభ్రత, పచ్చదనం పాటిస్తే ప్రభుత్వం ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నట్లు డీపీవో ధనలక్ష్మి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీఆర్ వన్ యాప్ నిర్వహణలో పంచాయతీ కార్యదర్శులు పారదర్శకత పాటించాలని డీపీవో సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు రెండో రోజు ఆర్‌జీఎస్ఏ పథకం శిక్షణ తరగతులు నిర్వహించారు.ఈ సందర్భంగా



శిక్షణలో మాట్లాడుతున్న డీపీవో ధనలక్ష్మి

డీపీవో మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం నిర్వహణ, పచ్చదనంతో చక్కగా ఉంటే గ్రామ పంచాయతీలకు జిల్లా కలెక్టర్ రూ.25వేలు అవార్డు ప్రకటిస్తారన్నారు. పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ ఈనెల 10న ముగిసినా, దీన్ని నిరంతరంగా కొన సాగిస్తామన్నారు. ప్రజారోగ్యం కాపాడటానికి మురుగుకాలువలను శుభ్ర పరచడం, బ్లీచింగ్ చల్లడం, తాగునీటి పథకాలను క్లోరినేషన్ చేయించాలన్నారు. ఈనెలాఖరులోపు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్లను ఉపయోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో నాగరాజు, ఎంపీడీవో భానుప్రసాద్, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సంఘటితంగా పోరాడాలి



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన ఎరుకుల ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు

మదనపల్లె టౌన్, ఆగస్టు 9: ఆదివాసిలైన ఎరుకలు కలసికట్టుగా ఉంటూ సమస్యలు పరిష్కరించుకోవాలని మదనపల్లె డివిజన్ ఎస్టీ ఎరుకుల ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీరమణ, కార్యదర్శి నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి వారు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు సంఘటితంగా ఉంటూ ఎరుకులను అన్ని రంగాల్లో ఎదిగేందుకు సహకరించాలని కోరారు. అలాగే ఏపీ గిరిజన యానాది సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఎన్‌జీవో హోమ్ వరకు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఆదివాసిల సంస్కృతి, సాంప్రదాయాలను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు జానం గంగిరెడ్డి, టి.రెడ్డెప్ప, కె.విజయకుమార్,రాజేష్, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలు



ర్యాలీ నిర్వహిస్తున్న ఏపీ గిరిజన యానాది సేవా సంఘం సభ్యులు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 9: ఏపీ గిరిజన యానాది సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేడ్కర్ సర్కిల్ నుంచి మల్లికార్జున సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎన్జీవో హోంలో ఏపీ జీవైఎస్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఏపీ గిరిజన యానాది సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులు మాట్లాడుతూ ఆదివాసీ వర్గాల సంప్రదాయాలు, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం గౌరవాధ్యక్షుడు జానం గంగిరెడ్డి, రాష్ట్ర కోశాధికారి టేకుమంద రెడ్డెప్ప, నాయకులు కిల్లా విజయకుమార్, రాజేష్, సంఘం మహిళా రాష్ట్ర కార్యదర్శి నారాయణమ్మ, మండల సంఘం అధ్యక్షుడు స్టుడియో మధు, కొండయ్య, వెంకటేష్, జలకం శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

పీలేరులో: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శుక్రవారు గిరిజన, దళిత సంఘాలు ఘనంగా జరుపుకున్నారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన యా నాది సేవా సంఘం(ఏపీజీవైఎస్ఎస్) ఆధ్వర్యంలో గిరిజన, దళిత సంఘ నేతలు స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గిరిజన యానాది సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షు డు పులి శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడు జానం గంగి రెడ్డి మాట్లాడుతూ విద్యా, ఆరోగ్య సేవలు పొందడంతో ఆదివాసీలు ఇప్పటికీ వెనుకబడి ఉన్నారని వాపోయారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీజీవైఎస్ఎస్ నాయకులు ఆదినారాయణ, కిల్లా విజయ్ కుమార్, దళిత నాయకులు ధరణీ కుమార్, బాస్ నాయకులు పూలకుంట శ్రీనివాసులు, గట్టప్ప, గండికోట వెంకటేశ్, బీసీ నేతలు మహేశ్ యాదవ్, షాహిన్‌షా, బుజ్జు, తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీ హోల్డ్ భూముల అక్రమాలు బయట పెడుతాం



మాట్లాడుతున్న టీడీపీ నేత జయచంద్రారెడ్డి

ములకలచెరువు, ఆగస్టు 9: వైసీపీ ప్రభుత్వ హయాంలో ఫ్రీ హోల్డ్ భూముల్లో జరిగిన అక్రమాలు బయటపెడుతామని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. ములకలచెరువులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పెద్దిరెడ్డి కుటుం బం, అనుచరుల చేతుల్లో మోసపోయిన భూ బాధితులకు న్యాయం చేస్తామన్నారు. 2023లో అప్పటి వైసీపీ ప్రభుత్వం ఇష్టానుసారంగా భూముల ను ఫ్రీ హోల్డ్ చేసి లాక్కుందన్నారు. సమావేశంలో తంబళ్లపల్లె నియోజకవర్గ సమన్వయ కర్త సీడు మల్లికార్జున నాయుడు, మంత్రి గిరిధర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు పాలగిరి సిద్ధా, రెడ్డెప్పరెడ్డి, వైజీ సురేంద్రయా దవ్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు చెన్నకిష్టా, జిల్లా నాయీ బ్రహ్మణ సెల్ అధ్యక్షుడు కేశవులు, నేతలు ప్రసాద్‌రావు, తులసీధర్ నాయుడు, కేవీ రమణ, శివారెడ్డి, భాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి సహకరించండి

పాఠశాలల అభివృద్ధికి సహకరించాలని టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. ములకలచెరువులో శుక్రవారం నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో నూతనంగా ఎన్నికైన పాఠ శాల యాజమాన్య కమిటీ ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికిమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు.

అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట

నిమ్మనపల్లి, ఆగస్టు 9: మండలంలోని 9 రెవెన్యూ గ్రామాలలో శనివారం నుంచి కమిటీల ఆధ్వర్యంలో ఇసుకను అక్రమంగా తరలించకుండా కట్టడి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ ధనంజేయులు తెలిపారు. రాష్ట్రంలో ఉచితంగా ఇసుకను ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో నిమ్మనపల్లి బాహుదా కాలువల్లో రీచ్ కేటాయించకున్నా అక్రమార్కులు ఇసుకను తరలించడంపై తహసీల్దార్ స్పందించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రతి రెవెన్యూ గ్రామంలో ముగ్గురు అధికారులు విధుల నిర్వర్తిస్తారని వారిలో వీఆర్వో, పోలీసు. మహిళా పోలీసు ఉంటారన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవన్నారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన టీచర్ పంచాయితీ

వాల్మీకిపురం, ఆగస్టు 9: వాల్మీకిపు రం పట్టణంలోని ఎంపీడీవో కార్యా లయం సమీపాన ఉన్న వెస్ట్ ప్రభు త్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యా యుడి పంచాయితీ పోలీస్‌స్టేషన్ చేరింది. కాగా శుక్రవారం ఉద యం నూతనంగా ఎన్నుకున్న స్కూల్ కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు పాఠశాలకు వచ్చి పరిచయం చేసుకోబోగా డెప్యుటేషన్‌పై పని చేస్తున్న ఉపాధ్యాయుడు భీమ్లానాయక్ సరిగా సమాధానం చెప్పలేదు. ఇం తలో అక్కడికి వచ్చిన ఎంఈవో వెంకటరత్నం వారించిన ఆ ఉపాధ్యాయుడు ఆయనతో వాదనకు దిగాడు. విషయం తెలుసుకున్న సీఐ పులి శేఖర్ విచారించి సర్దిచెప్పి ప్రయత్నం చేశారు. ఏదిఏమైనప్పటికీ స్కూల్ కమిటీ ఎన్నికల విషయంలో ఇష్టా రాజ్యంగా వ్యవహరించిన ఉపాధ్యాయుడును తక్షణమే సస్పెండ్ చేయాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు బొక్కసం రామకృష్ణ, నాయకులు పీవీ నారాయణ, రాజేం ద్రాచారి, రామచంద్ర, ఆనంద్, డిష్ బ్రదర్స్ కిట్టు, సాదిక్, చాను, సికిందర్, శంకర, రామచంద్ర, రెడ్డిరామ్, స్కూల్ కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

ఘటనపై జిల్లా అధికారి విచారణ

వాల్మీకిపురం వెస్ట్ స్కూల్‌లో గురువారం జరిగిన సంఘటనపై శుక్రవారం జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి (సీఎంవో) కరుణాకర్ విచారణ చేపట్టారు. స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో మండల విద్యాశాఖ అధికారు లు, ఉపాధ్యాయుడు భీమ్లానాయక్‌ను విచారించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి కరుణాకర్ మాట్లాడుతూ స్కూల్ కమిటీ ఎన్నికలు సక్రమంగానే జరిగాయని, అయితే ఉపాధ్యాయుడి ప్రవర్తన పట్ల విచారణ పూర్తి చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామని, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవ డం జరుగుతుందని తెలిపారు.

విద్యార్థులకు ఉచిత న్యాయ సేవలు లభ్యత

కలికిరి, ఆగస్టు 9: విద్యార్థులు ఎదుటివారి హింసకు లేదా మోసాలకు గురైతే చట్టపరంగా వారికి రక్షణ ఇవ్వడానికి ఉచితంగా న్యాయ సేవలు లభిస్తాయని వాల్మీకిపురం జూనియర్ సివిల్ జడ్జి కె.గురు అరవింద్ హామీ ఇచ్చారు. అదే విధంగా విదార్థులు కూడా ఎలాంటి అసాంఘిక విషయాల్లోనూ తలదూర్చకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. శుక్రవారం స్థానిక జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు కఠినమైన చట్టాల గురించి అవగాహన కల్పించే నిమిత్తం ఏర్పాటు చేసిన సదస్సులో జడ్జి మాట్లాడారు. కార్యక్రమంలో మేడికుర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చిన్నరెడ్డెయ్య, టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాస వర్మ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు హాజరయ్యారు.

విద్యుత్ ఓసీ అసోసియేషన్ ఎంపిక

మదనపల్లె టౌన్, ఆగస్టు 9: మదనపల్లె డివిజన్ విద్యుత్ ఓసీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడుగా జి.రామలింగారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శేషాద్రి నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె.రెడ్డెప్ప, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా జె.శ్రీనివాసులు, డి.కుమార్, సర్కిల్ ఈసీ మెంబర్‌గా రఘు, సలహాదారుడిగా బి.వసంతరెడ్డి, కోశాధికారిగా డి.శివమూర్తి, ఉపాధ్యక్షులుగా .మహబూబ్‌బాషా, ఎం.రఘునాథరెడ్డి, సంయుక్త కార్యదర్శులుగాకలాంబాషా, మనోహర్‌రెడ్డి, సాయిప్రతాప్‌లను ఎంపిక చేశారు.

ఉపాధి బహిరంగ సభ వాయిదా

తంబళ్లపల్లె, ఆగస్టు 9: తంబళ్లపల్లెలో శనివారం నిర్వహించను న్న సామాజిక తనిఖీ బహి రంగ సభను వాయిదా వేసినట్లు ఎంపీడీవో కృష్ణమూ ర్తి, తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదే శాల మేరకు సభను వాయిదా వేసినట్లు తెలిపారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

పెద్దమండ్యం, ఆగస్టు 9: పెద్దమండ్యం సమీపంలో అభయ అంజనేయస్వామి నూతన ఆలయంలో స్వామి వారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ భక్తుల జయజయధ్యానాల మధ్య వైభవంగా జరిగింది. శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి 6.30 గంటల మధ్య విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం వేద పండితులు నిర్వహించారు. నిర్వహకులు కత్తి నాగరాజు భాగ్యలక్ష్మీదంపతులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

డ్రై ఫ్రూట్స్ అలంకరణలో కన్యకా పరమేశ్వరి

పీలేరు, ఆగస్టు 9: శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా పీలేరులోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు డ్రై ఫ్రూట్స్ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జీడిపప్పు, బాదాం, పిస్తా, ఎండు ద్రాక్ష తదితర డ్రై ఫ్రూట్స్‌తో ఆలయ అర్చకులు చంద్రశేఖర శర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం జరిగిన పూజల్లో ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి సతీమణి నల్లారి తనూజా రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు మహేశ్ గుప్తా, విజయ మహేశ్, టీడీపీ మహిళా నేతలు పురం రెడ్డమ్మ, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

12 మంది జూదరుల అరెస్టు

గుర్రంకొండ, ఆగస్టు 9:జిల్లా సరిహద్దు ప్రాంతమైన టి.పసలవాండ్లపల్లె అటవీ ప్రాంతంలో శుక్రవారం జూదరులుపై పోలీసులు దాడులు చేసి 12 మంది అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి తెలిపారు. మండలంలోని టి.పసలవాండ్లపల్లె పంచాయతీ కుమ్మరిపల్లె అటవీ ప్రాంతంలో చిన్నమండెం, గుర్రంకొండ, పెద్దమండెం మండలాలకు చెందిన జూదరులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో గుర్రంకొండ ఎస్ఐ సిబ్బంది దాడులు నిర్వహించి 12 మంది జూదరులు పట్టుబడగా వారి వద్ద నుంచి రూ.41600 నగదు, 20 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

తంబళ్లపల్లె, ఆ గస్టు 9: మం డలం బళ్లాపు రంపల్లెలో నూతన వినాయక ఆలయానికి శు క్రవారం గ్రామ స్థులు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

పులిపిరికి అరుదైన చికిత్స

» ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు



పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

కడప జిల్లా : ఆగస్టు 09: పులిపిర్లకు వడియార మల్లికార్జున అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకుపసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. కడప జిల్లా, కొత్త బస్‌స్టాండ్ ప్రక్కన ఎస్.పి.బంగ్లా ఎదురుగా, హరిత హోటల్, ఎపి టూరిజం కడప నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 09, 10, 11 తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరి నైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. శని, ఆది రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లులోని సంప్రదించాలన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఇంట్లో నల్లకాగితాలు ఎలా దొరికాయి..?

మదనపల్లె టౌన్, ఆగస్టు 9: తాను తెల్లకాగితం లాంటి వాడిననని, తన ఐదేళ్ల పాలనలో నిజాయితీగా పనిచేశానని గొప్పలు చెప్పుకున్న మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఇంట్లో పోలీసుల సోదాలు జరిపినపుడు ఉండకూడని పత్రాలు ఎలా దొరికాయని మున్సిపల్ మాజీ ఛైర్మన్ ముజీబ్ హుస్సేన్ ప్రశ్నించారు. శుక్రవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవాజ్‌బాషా ఎమ్మెల్యేగా వున్నపుడు లేఅవుట్ల అక్ర మాలపై తాను ప్రశ్నిస్తే తన మందులషాపుపై డ్రగ్ ఇన్‌స్పెక్టర్, వైద్యాధికారులను పంపి తనిఖీలు చేయించి తప్పుడు కేసులు పెట్టి దుకాణాన్ని సీజ్ చేయించారన్నారు. దీనిపై పరువునష్టం, ఆర్థిక నష్టం కలిగించిన అధికారులపై కోర్టులో కేసు వేస్తానన్నారు.

రేషన్‌షాపు అక్రమాలపై సివిల్‌సప్లైస్ డీటీ విచారణ

బి.కొత్తకోట, ఆగస్టు9: బి.కొత్తకోట పట్టణంలోని రేషన్‌షాపులో అక్రమాలు జరుగుతు న్నా యన్న ఫిర్యాదుల నేపథ్యంలో సివిల్ సప్లైస్ డీటీ వెంకటరెడ్డి శుక్రవారం విచారణ నిర్వహించారు. పట్టణంలోని రేషన్‌షాపు నెంబరు1 లో రేషన్ సరుకుల నిల్వలు, సరఫరా పై ఆకస్మిక తనిఖీలు చేసి స్టాకు కంటే 23 బస్తాల బియ్యం తక్కువగా ఉండటాన్ని గమనించారు. అదే విధంగా కందిపప్పు రీప్లేస్ చేయనందున 19కిలోల ప్యాకెట్లు పురుగులు పట్టిపోయి ఉండటాన్ని కూడా నమోదు చేసు కున్నారు. ఈ విషయమై సంబంధిత డీలరుపై 6ఏ కేసు నమోదు చేశారు. ఈ రేషన్‌షాపు తనిఖీలో వెలుగు చూసిన అక్రమాలను అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు రిపోర్టు చేశారు.

పట్టాభిషేక మహోత్సవాలకు అంకురార్పణ

వాల్మీకిపురం, ఆగస్టు 9: పట్టణంలో వెలసి న పట్టాభిరామాలయంలో టీటీడీ ఆధ్వ ర్యంలో రాముడి పట్టాభిషేక మహోత్స వాలకు శుక్రవారం అంకురార్పణ వైభవం గా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, ఆలయంలోని మూలవర్లకు అభి షేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం పట్టాభిషే క ఉత్సవాలకు అంకురార్పణ గావించారు. కార్యక్రమాలలో టీటీడీ ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్ వెంకటస్వామి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఇసుక డంప్ సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు

గుర్రంకొండ, ఆగస్టు 9:మండలంలోని ఉసిరి కాయలపల్లె పొలాల్లో డంప్ చేసిన ఇసుకను రెవెన్యూ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. ఈ ప్రాంతంలో ఇసుక డంప్ ఉన్నట్లు సమాచారం రావడంతో తహశీల్దార్ శ్రీనివాసులు, వీఆర్వో ప్రవీణ్‌కు సూచించడంతో 20 లోడ్ల ఇసుక డంప్‌ను సీజ్ చేశారు. సీజ్ చేసి రెవెన్యూ సిబ్బందిని కాపలాగా ఉంచారు.